

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 16.01.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 33 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## తెలుగు తేజానికి అంతరిక్ష అవార్డు



తెలుగుజాతి గర్వించదగ్గ అంతరిక్ష శాస్త్రవేత్త, శ్రీహరికోటలోని షార్ డైరెక్టర్ యం.వై. యస్.ప్రసాద్‌ను ప్రతిష్టాత్మకమైన విక్రమ్‌సారాభాయ్ మెమోరియల్ అవార్డు వరించింది.

(మిగతా 10వ పేజీలో)

## రాష్ట్ర బీజేపీలో... 'అమితో'త్సాహం



- ఏపిలో బీజేపీ స్పీడ్‌కు అధ్యక్షుడి పచ్చజెండా
- టీడీపీతో పొత్తు వున్నా పార్టీని పెంచాలని ఆదేశం

**2014** సార్వత్రిక ఎన్నికల ఘనవిజయంతో దేశమంతా కూడా బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయి. మోడీ హవా లోక్‌సభ ఎన్నికలకే పరిమితం కాలేదు. ఆ తర్వాత జరిగిన ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ జైత్రయాత్ర కొనసాగుతూనే వుంది. అలెగ్జాండర్ ప్రపంచ జైత్రయాత్ర చేసినట్లుగా ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ద్వయం కూడా దేశంలోని ఆయా రాష్ట్రాలను వశపరచుకుంటూ వస్తున్నారు. వారిరువురి నాయకత్వంలో ఇప్పటికే మహారాష్ట్ర, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు బీజేపీ ఖాతాలో జమపడ్డాయి. జమ్ము, కాశ్మీర్ వంటి ముస్లిం ఆధిపత్య రాష్ట్రంలో కూడా బీజేపీ అప్రతిహంగా సీట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. అసలు పార్టీ ఉనికి అంతంత మాత్రంగా వున్న హర్యానాలో బీజేపీ అధికారంలోకి వచ్చింది.

మోడీ-అమిత్‌షా ద్వయం జైత్రయాత్ర ఇక్కడితో ఆగేటట్లు లేదు. మరికొన్ని రాష్ట్రాలను వాళ్లిద్దరూ టార్గెట్ చేస్తున్నారు. వాళ్ల తదుపరి లక్ష్యాలలో బీహార్, కర్నాటక, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలున్నాయి. పశ్చిమబెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా పాగా వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వారి టార్గెట్‌లో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు కూడా చేరాయి. ఈ రెండు రాష్ట్రాలలోనూ బీజేపీ బలోపేతం కావడానికి ఇదే సరైన సమయంగా అమిత్‌షా భావిస్తున్నారు. ఇటీవలే ఆయన హైదరాబాద్, విజయవాడలలో (మిగతా 10వ పేజీలో)

## పక్షుల పండుగ



10లో

## గల్లీ, ఢిల్లీ రెండూ తెలిసిన నేత

### - వెంకయ్యకు మోడీ ప్రశంస



10లో

## పెద్ద పండుగ



3లో

## పశువుల పండుగ



5లో



# ఖజానా డొల్ల... రోడ్లు గుల్ల



***జిల్లాలో గ్రామీణ రహదారుల పరిస్థితే కాదు, ప్రధాన రహదారుల పరిస్థితి కూడా అధ్వాన్నంగా తయారైంది. ముఖ్యంగా కొత్త రోడ్లు వేయడానికి, కనీసం గుంతలు పడిన రోడ్లకు ప్యాచింగ్‌లు వేయడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొనడంతో రోడ్ల మీద అవస్థల ప్రయాణం తప్పడం లేదు.***

రాష్ట్ర విభజన తర్వాత ఏపికి చిప్ప మిగిలింది. ఖజానాలో చిల్లర లేకుండా పోయింది. తెలుగుదేశం ప్రభుత్వం రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాల గురించి పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో వస్తున్న అరకొర ఆదాయం ఋణమాఫీకి, పింఛన్‌లు, ఆకర్షణీయ పథకాల అమలుకే సరిపోతుంది. కొత్తగా రోడ్లు మంజూరు చేసే పరిస్థితి కాదు కదా, పాడైన రోడ్లకు మరమ్మత్తులు చేసే దిక్కు కూడా లేదు.

ముంబై రహదారిలో నెల్లూరు నుండి సంగం వరకు రోడ్డు పాడై పోయి వుంది. కొన్ని చోట్ల వంతెనలకు గండ్లు పడి వుండడంతో అక్కడ ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. నెల్లూరు నుండి సంగం వరకు సిసిరోడ్డు మంజూరైనట్లు చెపుతున్నారు. ఆ రోడ్డు పనులు ఎప్పుడు మొదలవుతాయో చెప్పలేని పరిస్థితి. అసలు ఇక్కడ సిసి రోడ్డు కంటే కూడా తారురోడ్డే ఎంతోనయం. సిసిరోడ్డు ఒక్కసారి పాడైందంటే ఇక దానిని బాగుచేయడం కష్టసాధ్యమవుతుంది. సంగం నుండి హసనాపురం వరకు డబుల్‌రోడ్డు వేశారు. అక్కడ నుండి కలిగిరి వరకు రోడ్డు నికృష్టంగా వుంది. వింజమూరు - ఉదయగిరి, దుత్తలూరు - పామూరు, నందవరం - ఉదయగిరి, ఆత్మకూరు - సోమశిల రోడ్లు గుంతలమయమై వున్నాయి. నార్త్‌రాజుపాలెం-అల్లూరు, కోట - వాకాడు రోడ్డు, నాయుడుపేట - చిట్టమూరు, సూళ్లూరుపేట-కోట, గూడూరు - సైదాపురం రోడ్లు కూడా గతుకులమయమై ఉన్నాయి. ఇక ఆయా గ్రామాల రోడ్ల పరిస్థితి కూడా అధ్వాన్నంగానే వుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా ఇంతవరకు ఒక్క కిలోమీటరు తారురోడ్డు కూడా వేయలేదు. అసలు రోడ్లకు నిధులంటేనే ప్రభుత్వం చేతులెత్తేస్తుంది. రాబోయే నాలుగున్నరేళ్లలో కూడా రోడ్లకు పెద్దగా డబ్బులొచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

సింహపురి సమాచారం

## కలిగిరి పొగాకు వేలం కేంద్రంకు అవార్డు

గుంటూరులో ఇటీవల పొగాకు బోర్డు అవతరణ దినోత్సవసభ జరిగింది. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు అవార్డులను ప్రకటించారు. 2013-14 పంట కాలానికి ఉత్తమ పొగాకు వేలం కేంద్రంగా కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రం ఎంపికైంది. ఇందుకు కృషి చేసిన కలిగిరి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి కొల్లి అప్పారావును పొగాకు బోర్డు ఛైర్మెన్ డాక్టర్ కె.గోపాల్ సన్మానించి అవార్డులను అందజేశారు. కలిగిరి పొగాకు బోర్డు పరిధిలో ఉత్తమ రైతుగా కొండాపురం మండలం వెలిగండ్లకు చెందిన చల్లా మాధవ ఎంపికయ్యారు. కలిగిరి పొగాకు బోర్డుకు అవార్డు రావడంపై రైతాంగం, బోర్డు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

### నగదు బదిలీ పథకంతో...

## గ్యాస్ మంట



నెల్లూరుజిల్లాలో జనవరి 1వ తేదీ నుండి మరలా అమల్లోకి వచ్చిన నగదు బదిలీ పథకంతో వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. జిల్లాలో మొత్తం 52 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి ద్వారా 5.10లక్షల మంది వినియోగదారులు వంటగ్యాస్ కనెక్షన్లను వినియోగించుకుంటున్నారు. గతంలో 14.2కేజీల సిలిండరు ధర రాయితీతో కలిపి రూ.450లు వినియోగదారుడు చెల్లిస్తుండగా, తాజాగా నగదు బదిలీ ద్వారా 14.2 కేజీల సిలిండరుకు ధర రాయితీ లేకుండా రూ.768.58 చెల్లించాలి. ఇందులో ప్రభుత్వం రాయితీతో కలిపి రూ.450లు తీసుకుని మిగిలిన రూ.318.58లు బ్యాంకులో వినియోగదారుని ఖాతాలో జమచేయాలి. కానీ వినియోగదారుని ఖాతాలో కేవలం రూ.296.58 మాత్రమే జమవుతోంది. రూ.22లు వ్యాట్ రూపంలో ప్రభుత్వం వసూలు చేస్తున్నట్లు ఏజెన్సీల నిర్వాహకులు తెలియజేస్తున్నారు.

## 'తిలాపియా' చేపల పెంపకం లాభదాయకం

### ---------- ముత్తుకూరు మత్స్య కళాశాల ప్రొఫెసర్ల సూచన

తిలాపియా చేపల పెంపకం లాభదాయకమేనని, రైతులు వీటి పెంపకం చేపడితే మంచి లాభాలు పొందవచ్చని ముత్తుకూరులోని మత్స్యకళాశాలకు చెందిన పలువురు ప్రొఫెసర్లు సూచించారు. ఈ నెల 9న ఆ కళాశాల అసోసియేట్ డీన్ కెవిఎస్ కృష్ణప్రసాద్, ప్రొఫెసర్లు పి. హరిబాబు, డిఆర్‌కె రెడ్డి, ఓ. సుధాకర్, పలువురు విద్యార్థులు తిలాపియా చేపల పెంపకాన్ని వివరించారు. ఆఫ్రికా దేశానికి చెందిన ఈ రకం చేపలను ప్రపంచ వ్యాప్తంగా 85 దేశాల్లో పెంపకం సాగిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ రకం చేపల పట్ల చాలాకాలంగా రైతులు ఆసక్తి చూపడం లేదని వారు పేర్కొన్నారు. తిలాపియా చేపల్లో నైల్ తిలాపియా, మొజాంబిక్ తిలాపియా, రెడ్ తిలాపియా, గిఫ్ట్ తిలాపియా అనే నాలుగు రకాలున్నాయని వారు వివరించారు. ఈ చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహించి, ఎగుమతులు, గిట్టుబాటు ధరలు వగైరాలపై ప్రభుత్వం భరోసా కల్పిస్తే బోన్‌లెస్ చేపగా దీనికి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. మంచి పోషకాలున్న ఈ చేపలకు యూరప్ దేశాల్లో బాగా డిమాండ్ వుందన్నారు.ప్రణాళికాబద్దంగా ఈ చేపల పెంపకం చేపడితే ఖచ్చితమైన లాభాలు వస్తాయన్నారు. ఈ రకం చేపల పెంపకంపై ఏమైనా సందేహాలుంటే మత్స్యకళాశాల శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చని తెలిపారు.

### తైక్వాండో రాష్ట్ర పోటీలకు

## కీర్తన, మాధవి

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు నెల్లూరుజిల్లా బాలాయపల్లి మండలం ఉన్నతపాఠశాలకు చెందిన కీర్తన, మాధవీలు ఎంపికయ్యారు. ఈమేరకు నెల్లూరుజిల్లా స్థాయిలో ఎంపికైన ఎనిమిది మంది జట్టులో వీరు చోటు దక్కించుకున్నట్లు వ్యాయామ సంచాలకులు కిషోర్ ఇటీవల తెలిపారు. విజయవాడలో జరిగే రాష్ట్ర పోటీలకు వీరు హాజరు కానున్నారు. విద్యార్థినులను ఎంపిడివో విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు అభినందించారు.

### కసుమూరు దర్గాలో

## 17 నుండి ఉరుసు

వెంకటాచలం మండలంలోని కసుమూరు దర్గాలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా సూపరింటెండెంట్ షేక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు జిల్లా నుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేస్తుంటారని, ఈ ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## ఘాట్‌లో దారిదోపిడీ

రాపూరు-చిట్వేల్ ఘాట్‌రోడ్డులో ఈ నెల 10వ తేదీ ఉదయం దారిదోపిడీ చోటుచేసుకుంది. బాలాయపల్లి మండలం వెంగమాంబపురంకు చెందిన ధాన్యం వ్యాపారి నాగం బాబునాయుడు ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులిచ్చేందుకు దాదాపు 5లక్షల నగదుతో రాజంపేట సమీపంలోని తాళ్లపాకకు బయల్దేరాడు. బైక్ 8-9కిలోమీటర్ల వద్ద వున్న మలుపు వద్దకు రాగానే ఇద్దరువ్యక్తులు అతని బైక్ ఆపి తమ బైక్ చెడిపోయిందని, స్పానర్ కావాలని అడిగారు. బాబునాయుడు స్పానర్ లేదని చెబుతుండగానే ఆ ఇద్దరు వ్యక్తులు అతని మీద దాడి చేసి బైక్ కవర్‌లో వున్న 5లక్షల నగదును లాక్కుని పరారయ్యారు. బాధితుడు షాక్ నుండి తేరుకుని రాపూరుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## కనుపూరు కాలువను పరిశీలించిన సోమిరెడ్డి

నెల్లూరుజిల్లా విరువూరు సమీపంలో ఉన్న కనుపూరు కాలువను తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం నుండి అనుమతులు రాకున్నా రైతులే నిధులు సమకూర్చుకుని పడవల సహాయంతో కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులు చేస్తున్నారన్నారు. రాష్ట్ర పునర్విభజనతో ఇంజనీర్ల బదిలీలు, నిధుల కేటాయింపుల జాప్యంతో కాలువల అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. ఒక కిలోమీటరు పూడిక తొలగింపుకు దాదాపు రూ.50వేలు ఖర్చవుతోందన్నారు. మనుబోలు మండలం నుంచి ఎక్కువ మంది రైతులు వంతులవారీగా కాలువ పూడిక పనులు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కనుపూరు కాలువ డిఇఇ సవీవుల్లా, తెలుగుదేశంపార్టీ నాయకులు రావుల దశరథరామయ్యగౌడ్, ఎంపిటిసి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చక్కెర ఫ్యాక్టరీ

## పరికరాల తరలింపులో తకరాలు

నెల్లూరుజిల్లా కోవూరు సహకార ఫ్యాక్టరీ పరికరాల తరలింపులో అధికారులకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులకు మధ్య తకరాలు ఏర్పడ్డాయి. ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారానికి టర్బైన్, ప్యానల్ బోర్డుతో పాటు మరికొన్ని పరికరాలు అవసరం కావడంతో కోవూరు సహకార చక్కెర కర్మాగారం నుంచి వాటిని తరలించేందుకు అధికారులు ఇటీవల సన్నాహాలు చేస్తుండగా కర్మాగార కార్మికులు అడ్డుకోవడంతో కర్మాగారం సిఇ జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఆ పరికరాలను ఏటికొప్పాకకు పంపించేందుకు 9వ తేదీ ఉదయం కర్మాగారానికి కోవూరు తహశీల్దార్ నరశింహులు, సిఐ అశోక్‌వర్దన్, సిబ్బందితో వచ్చారు. కర్మాగారంలోని కార్మిక సంఘాల నాయకులు ఓబుల్‌రెడ్డి, రమణయ్యలతో మాట్లాడి పదిరోజుల్లో తీసుకెళ్లిన పరికరాలను తిరిగి తీసుకొచ్చే విధంగా వారిని ఒప్పించారు. దీంతో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు సమ్మతించారు. కాని ఆ దశలో రైతు సంఘాల నాయకులు హరికిషోర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకమరాజు, శ్రీనివాసులురెడ్డి తదితరులు కర్మాగారానికి చేరుకుని పరికరాలను తీసుకుపోవద్దంటూ అధికారులతో వాగ్వాదం చేశారు. దీంతో జేసీ ఇంతియాజ్‌అహ్మద్ వారిని శాంతింపజేసే ప్రయత్నాలు చేసి విఫలమవడంతో జేసీ కలెక్టర్ జానకికి ఈ విషయాన్ని తెలియజేశారు. దీంతో రైతు సంఘాల నాయకులను తన బంగ్లాకు తీసుకురావాలని కలెక్టర్ చెప్పడంతో జేసి వారిని తీసుకుని నెల్లూరు వెళ్లారు.

## వైకాపా జంబో కార్యవర్గం

వైఎస్సార్సీపిని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు జిల్లా కమిటీలో మరింత మందిని నియమించేందుకు పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఆ మేరకు వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈ నెల 9న జిల్లా కమిటీలో నూతనంగా నియమితులైన వారి పేర్లను ప్రకటించారు.

వైఎస్సార్సీపి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శులుగా దువ్వూరు బాలచంద్రారెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, దబ్బల రాజారెడ్డి, పేరం మధునాయుడు, కొల్లి పవన్‌కుమార్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి, బులగాకుల అనిల్‌కుమార్‌రెడ్డి, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కార్యదర్శులుగా అళహరి చిట్టిబాబు, గంధం ప్రసన్నాంజనేయులు, మెట్టా రాధాకృష్ణారెడ్డి, వంకా రమణయ్య, దాసరి వెంకటేశ్వర్లు, షేక్ అలీ అహ్మద్, బొల్లినేని వెంకటసత్యనారాయణ, కురుగొండ ధనలక్ష్మి, వి.బాబు నాయుడు, మలినేని వెంకయ్యనాయుడు, మనుబోలు శిఖిందర్‌రెడ్డి, బత్తిన పట్టాభిరామిరెడ్డి, దాసరిరాజు శంకర్‌రాజు, మారంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, నాపా వెంకటేశ్వరనాయుడు, గునుపాటి సురేష్‌రెడ్డి, పెనాక నాగశ్రీనివాసులురెడ్డి, ఎస్‌కె అల్లాభక్షు, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి నియమితులైనట్లు తెలిపారు. సంయుక్త కార్యదర్శులుగా ఆర్‌కె సుందర్‌రెడ్డి, ఎం.పాండురంగయాదవ్, చింతంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఎస్‌కె సుభాని, పర్వతాల శ్రీనివాసులు, జి.సరళ, మందా పెద్దబాబు, పఠాన్ జిలానీఖాన్, జి.జ్యోతిశ్రీ, చిట్టేటి హరికృష్ణ, పోతినేని సాయినాయుడు, కుంచెం ప్రసాద్, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, దందు మహేష్‌రెడ్డి, పొక్కాల దుశ్యంత్‌శెట్టి, ఎ.రవీంద్రనాయుడు, వల్లూరు మోహన్, కామిరెడ్డి కస్తూరిరెడ్డి, రొండ్ల జయరామయ్య, మోడెం లక్ష్మీకుమారి, అనపల్లి ఉదయభాస్కర్, ఉప్పాల సుధాకర్‌గౌడ్, బొంతా హరిబాబు, మనుబోలు ప్రసాద్ రెడ్డి, వీరళ్ళ శ్రీనివాసులు, కోశాధికారిగా పచ్చిపాల సుధాకర్‌రెడ్డి నియమితులైనట్లు ఆయన వివరించారు.

### ఉపాధ్యాయుల సమస్యల

## పరిష్కారానికి కలసికట్టుగా కృషి

జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా కృషి చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల10న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేశాయిశెట్టి హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు ఉపాధ్యాయుల సమస్యలను చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


# అమెరికాలోని తొలి 100 భారతీయ కంపెనీలలో ఉత్తమ స్థానం పొందిన

## మన నెల్లూరీయుల సంస్థ

# సిఆర్ఎంఐటి సొల్యూషన్స్



**సి.ఐ.ఓ రివ్యూ మరియు సిలికాన్ ఇండియాల ప్రశంసల జల్లు**




si100 2014
Top 100 Tech Companies Founded and Managed by Indians in the U.S.

**నెల్లూరీయులు ఎక్కడున్నా వారి ప్రతిభకు ఆకాశమే హద్దుగా విజయాలు సాధిస్తారనడానికి మరో ఉదాహరణగా నిలిచింది మన నెల్లూరీయుడి సంస్థ సిఆర్ఎంఐటి సొల్యూషన్స్. బెంగుళూరు కేంద్రంగా సాఫ్ట్‌వేర్ సేవలను ప్రారంభించి ప్రపంచమంతా విస్తరించడమే కాకుండా నేడు అమెరికాలో అత్యద్భుత సేవలందిస్తున్న భారతీయ కంపెనీలలో వందలో ఒకటిగా ఈ సంస్థ గుర్తింపును పొందింది. భారతీయులచే స్థాపించబడి నిర్వహింపబడుతున్న బడా కంపెనీల జాబితాలో సిఆర్ఎంఐటి సొల్యూషన్స్ చేరింది.**

సిలికాన్ ఇండియా అనే సంస్థతో పాటు సిఐఓ రివ్యూ అనే పత్రిక జరిపిన సర్వేతో పాటు ఈ రెండు సేకరించిన సమాచారం ఆధారంగా "ఒరేకల్" విభాగంలో విశిష్ఠ సేవలందిస్తున్న అత్యుత్తమ కంపెనీగా సిఆర్ఎంఐటిని గుర్తించి వేలసంఖ్యలో వున్న సంస్థలలో తొలి వంద ఉత్తమ సంస్థలలో ఒకటిగా ఈ సంస్థను కీర్తించారు. తాము ముద్రించే పత్రికలలో ఈ రెండు సంస్థలూ ప్రధానంగా సిఆర్ఎంఐటిని గురించి ఘనంగా విశ్లేషించాయి.

సాంకేతిక విప్లవంతో వస్తున్న మార్పులు, సంతరించుకుంటున్న ఆధునిక హంగులు వీటితో పాటు వివిధ సంస్థలు సాధిస్తున్న విజయాలను ఎప్పటికప్పుడు ఐటి రంగ నిపుణులకు తాజాగా అందిస్తూ అమెరికాలో అగ్రభాగాన వున్న సిఐఓ రివ్యూ (Cio Review) అనే సాంకేతిక పత్రిక "ఒరేకల్"(Oracle) విభాగంలో సిఆర్ఎంఐటి సొల్యూషన్స్ అందిస్తున్న సేవలను విశేషంగా ప్రస్తావిస్తూ ఈ సంస్థను వంద అగ్రగామి సంస్థలలో ఒకటిగా గుర్తించింది.

సాంకేతిక పరంగానే కాకుండా నిర్వహణాపరంగా తమ సంస్థ అందిస్తున్న నాణ్యత(Quality), అంకితభావం (Commitment), సేవలు(Services) గుర్తించిన సిలికాన్ ఇండియా కూడా ఇదే యేడాది సిఆర్ఎంఐటిని గుర్తించి తమ పత్రికలో పతాక శీర్షికను కేటాయించడం ఈ సంస్థకు గర్వకారణంగా నిలిచింది.

ఒకే యేడాది రెండు ఉత్తమ సంస్థల ద్వారా తమ సిఆర్ఎంఐటి సొల్యూషన్స్‌కి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం తమ సంస్థ అందిస్తున్న సేవలకు నిదర్శనమని ఈ ఘనత తమ ఖాతాదారులతో పాటు తమ సిబ్బంది అందరికీ దక్కుతుందని సంస్థ సారథి వినోద్ నారపరెడ్డి తన ఆనందాన్ని వ్యక్తపరచారు.

నెల్లూరుకు చెందిన నారపరెడ్డి వినోద్ రెడ్డి సిఆర్ఎంఐటి సొల్యూషన్స్‌కి వ్యవస్థాపక సిఇఓగా వున్నారు. నెల్లూరుజిల్లా మైపాడు వాస్తవ్యుడిగా జిల్లా వాసులందరికీ చిరపరిచితులైన మేధావి కీ॥శే॥ నారపరెడ్డి కోదండరామిరెడ్డికి వినోద్ చిన్నకుమారుడు. వినోద్ సోదరుడు డా॥ విష్ణుస్వరూప్‌రెడ్డి ఇ.ఎన్.టి నిపుణుడిగా వైద్యరంగంలో సంచలనాలు సృష్టిస్తుంటే ఆయన తమ్ముడు వినోద్ సాఫ్ట్‌వేర్ రంగంలో సాంకేతిక బ్రహ్మగా రాణిస్తున్నాడు. అపార మేధస్సు కలిగిన విద్యావంతుడిగా కోదండన్నని ఎంతోమంది ఆదర్శంగా తీసుకునేవారు. ఆయన వారసులుగా జన్మించిన విష్ణు, వినోద్‌లు తండ్రినిమించిన తనయులుగా తమ ప్రస్థానాన్ని సాగిస్తున్నారు.

అగ్ర దేశమైన అమెరికాలో మన కీర్తిని రెపరెపలాడించి ఉత్తమ వంద సంస్థల్లో ఒకటిగా తమ సిఆర్ఎంఐటిని తీర్చిదిద్దిన వినోద్ మరియు వారి బృందానికి 'లాయర్' అభినందనలు.

# స్వర్ణభారత్‌లో సంక్రాంతి వెలుగులు

స్వర్ణభారత్ ట్రస్ట్... భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, మన భాషకు, భావానికి పెద్దపీట వేస్తున్న స్వచ్ఛంధ సేవాసంస్థ. గత 14ఏళ్లుగా నెల్లూరుజిల్లా వాసులకు విద్య, వైద్య రంగాలలో విస్తృతమైన సేవలందిస్తున్న ఈ ట్రస్ట్ భారతీయ ప్రాచీన సంస్కృతిని, పండుగలను జరుపుకోవడంలో ముందుంటుంది. ముఖ్యంగా తెలుగు సంస్కృతి, తెలుగు పండుగల నిర్వహణలో ఎప్పుడూ తన విశిష్టతను చాటు కుంటుంది. ప్రతిఏటా ఉగాది, సంక్రాంతి, విజయదశమి వేడుకలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. ఆ వేడుకలకు జాతీయ గుర్తింపు పొందిన రాజకీయ, సినీ, పారిశ్రామిక, సాహిత్య రంగాల ప్రముఖులను అతిథులుగా తీసుకొచ్చి ఆత్మీయంగా సత్కరిస్తుంటారు.


ఈ పరంపరలోనే ఈ నెల 11వ తేదీ స్వర్ణభారత్‌లో సంక్రాంతి వేడుకలు తెలుగుదనం ఉట్టిపడేలా జరిగాయి. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు కుమార్తె స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ కాలిగాయంతో ఈ వేడుకలను స్వయంగా దగ్గరుండి నిర్వహించలేకపోయారు. దీంతో ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన వెంకయ్యనాయుడే అన్నీ తానై ఈ వేడుకలను జరిపించారు. ఎటువంటి రాజకీయ వారసత్వం లేకుండా, సొంతంగా ఎదిగి అతి చిన్నవయసులోనే మహారాష్ట్ర సిఎం పీఠాన్ని అధిరోహించిన దేవేంద్ర ఫడ్నవీస్ ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే తెలుగు సినీపరిశ్రమలో మంచి ఊపుమీదున్న పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మరో అతిథిగా విచ్చేసారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, విశాఖపట్నం ఎంపీ హరిబాబులు పాల్గొన్నారు.



వెంకయ్యనాయుడు అధ్యక్ష ఉపన్యాసంలో స్వర్ణభారత్ ట్రస్ట్ 14ఏళ్లుగా క్రమశిక్షణకు వేదికగా నిలుస్తూ ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మన సంస్కృతిని, మన పండుగలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ దేశానికీ లేని సంస్కృతి భారతదేశానికి ఉందని, భారత్ విశ్వగురువుగా మారడం ఖాయమన్నారు. దేశం అంధకారమయమైన తరుణంలో నరేంద్ర మోడీ ప్రధాని కావడానికి ఎన్నో చేతులు సహకరించాయని, అందులో పవన్ కల్యాణ్ ఒకరని, ఎలాంటి పదవులు ఆశించకుండా ఆయన మోడీకి మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. అతిచిన్న వయసులోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయిన దేవేంద్ర ఫడ్నవీస్ అక్కడ అవినీతిపరుల పాలిట సింహస్వప్నంగా మారారన్నారు.









మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు ఎంతో బాగున్నాయని అభినందించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న అక్షర స్కూల్‌లో 'బోధన ఆంగ్లం, భావం భారతీయం' అనే నినాదం తనను ఎంతో ఆకట్టుకుందన్నారు. దేశంలో 50శాతం మంది 25ఏళ్లలోపు యువకులేనని, వీరంతా తమ నైపుణ్యాన్ని ఉపయోగించి పనిచేస్తే భారత్ రాబోయే 5ఏళ్లలోనే ప్రపంచ అగ్రరాజ్యంగా మారుతుందన్నారు.

పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ నెల్లూరులో సెయింట్‌జోసెఫ్ స్కూల్‌లో తాను చదువుకున్నానని, అక్కడి నుండే క్రమశిక్షణ అలవర్చుకున్నానని అన్నారు. క్రమశిక్షణతో కష్టపడితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదన్నారు. నేడు ప్రతిఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉంటుంది, ప్రతి ఇంటికీ డిష్‌టీవీ వుంది, అంగారకుడి మీదకు రాకెట్లు పంపే స్థాయికి శాస్త్ర విజ్ఞానం పెరిగింది, అయినా కూడా మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జైఆంధ్ర ఉద్యమం నాటి నుండి వెంకయ్యనాయుడు నాయకత్వాన్ని చూస్తున్నానని, ఆయన నాయకత్వం నేటి తరాలకు ఆదర్శప్రాయమన్నారు.

ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులందజేశారు. సభకు ముందు ఉదయం నుండి స్వర్ణభారత్‌లో సంగీతవిభావరి, గంగిరెద్దులు, పండరిభజన, కోలాటం వంటి సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. మహిళలు వేసిన ముగ్గులను దేవేంద్ర ఫడ్నవీస్, పవన్‌కల్యాణ్‌లు ఆసక్తిగా తిలకించారు.

### అల్లరితో అవస్థ

ఈ వేడుకలలో పవన్ అభిమానుల అల్లరి శృతిమించింది. వెంకయ్య ఎన్నిసార్లు వారించినా వారి నోర్లు మూతపడలేదు. వారి గోలతో దేవేంద్ర ఫడ్నవీస్ వంటి నాయకుడు మాట్లాడేది కూడా జనం వినలేకపోయారు.

### వెంకయ్య మెచ్చిన 'అత్తారింటికి దారేది'

ఈ సభలో వెంకయ్యనాయుడు పవన్ నటించిన 'అత్తారింటికి దారేది' సినిమా గురించి ప్రస్తావించారు. అప్పుడెప్పుడో మాయాబజార్, సువర్ణ సుందరి, గుండమ్మ కథ వంటి సినిమాలు చూసానని, ఈమధ్య విమానాలలో విదేశాలకు వెళ్లేటప్పుడు అనుకోకుండా 'అత్తారింటికి దారేది' సినిమాను మూడుసార్లు చూసానన్నారు. వినోదాత్మకంగా, సాహిత్యపరంగా ఆ సినిమా ఎంతో బాగుందంటూ పవన్ నటనను కూడా మెచ్చుకున్నారు.

# 'ప్రభా'తం

మృత్యువు అనేది ఎప్పుడు, ఎక్కడ ఎవరిని కబళిస్తుందో చెప్పలేం. అంతేకాదు, అది ఎక్కడ పొంచి వుంటుందో కూడా ఎవరూ చెప్పలేరు. కానీ.. ఎక్కువగా అది మన రోడ్ల పక్కనే నక్కి వుంటుందేమో ననిపిస్తోంది రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను చూస్తుంటే. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రోడ్లు మృత్యు ఘంటికలను మ్రోగిస్తూనే వున్నాయి. ఏ రోడ్డు పక్కన, ఏ మలుపులో దాగి వుంటుందో తెలియదు కానీ, మృత్యు రాకాసి నిత్యం ఎంతోమందిని బలిగొంటూనే వుంది. మొన్నటికి మొన్న పెనుకొండలో ఆర్టీసి పల్లె వెలుగు బస్సు గోతిలో పడిపోయి, అనేకమంది ప్రాణాలను కోల్పోయారు. అది పెనుకొండైనా, తిరుమల కొండైనా ఒకటే అన్నట్లుగా, నాలుగురోజుల క్రితం (ఈ నెల 11న) తిరుమల ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ఆర్టీసి బస్సులు ఢీకొని దాదాపు పాతిక మంది భక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇలా, రాష్ట్రంలో నిత్యం ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదాలు జరిగి పోతూనే వున్నాయి. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రరాష్ట్రాల్లో కలిసి, ఏటా 15 వేల మందికి పైగానే రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, మరో 50వేల మంది దాకా గాయాలపాలవుతున్నారని ఒక అంచనా. గత పదేళ్లలో దాదాపు లక్షా 50 వేల మందికిపైగానే ఇలా ప్రమాదాల వాతబడి మరణించగా, మరో 5లక్షల మంది దాకా గాయాలపాలైనారని గణాంకాలను బట్టి తెలుస్తోంది.దీన్నిబట్టి చూస్తే నానాటికీ రోడ్డు ప్రమాదాల పరిస్థితి ఎంత భయంకరంగా తయారవు తోందో తేటతెల్లమవుతుంది.

రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు నరకానికి నకళ్ళుగా వుంటున్నాయి. మృత్యుమార్గానికి ముఖ ద్వారాలుగా మారిపోతున్నాయి. సుఖంగా గమ్యం చేరాల్సిన ప్రయాణం.. ప్రమాదాల పాలై చివరికి విషాదాంతం అవుతోన్న సంఘటనలు బోలెడు. ఎప్పుడు ఏ రోడ్డుమలుపు.. మృత్యువు పిలుపుగా మారుతుందో చెప్పలేని పరిస్థితి. రోడ్ల నిర్మాణాల్లో అక్రమాలు, అవకతకవలు, అంతటా పెరిగిపోతున్న అవినీతి..మరోవైపుఎక్కడ చూసినా గతుకుల రోడ్లు.. వేలాదిగా డొక్కు వాహనాలు..ఇవన్నీ చాలవన్నట్లు మితిమీరిన వేగం..తదితర కారణాలతో ప్రతి నిత్యం ఎక్కడో ఒకచోట ఘోరమైన రోడ్డు ప్రమాదాలు జరిగిపోతూనే వున్నాయి..ఎంతోమంది మృత్యురాకాసికి బలైపోతూనే వున్నారు. ఇకనైనా ఈ పరిస్థితి మారాలి. అందుకు ప్రభుత్వం, అధికారులు అందరూ కలసి పటిష్టమైన కృషి చేయాలి. ఇటీవలికాలంలో జాతీయ రహదారులు కొంత మెరుగ్గానే వున్నప్పటికీ, అనేక పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితి ఎంతో దుర్భరంగా వుంటోంది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా వున్న ప్రాంతాలూ రాష్ట్రంలో అనేకం వున్నాయి. రోడ్లల్లో ఊహించని మలుపుల్లో, ప్రమాదకరంగా వున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు లేవు. ఘాట్‌రోడ్లలోనూ ప్రమాద సూచికలు వుండడం లేదు. పల్లెప్రాంతాల్లో మోకాటి లోతు గతుకుల రోడ్లలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగానే వున్నప్పటికీ పట్టించుకునేవారు వుండడం లేదు. ఎంతో కాలం నుంచి మరమ్మతులకు గురై, ప్రయాణీకులకు నరకం చూపిస్తున్న రోడ్లు పట్టణాల్లో, నగరాల్లో అనేకం వున్నప్పటికీ, ఎప్పటికప్పుడు వాటిని బాగు చేసేవారు లేరు. రోడ్ల నిర్వహణ అనేది అస్తవ్యస్తంగా మారిపోయి చాలా కాలమైంది. ప్రయాణం ప్రాణాంతకంగా మారిపోతున్నా ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకునేవారు కరువయ్యారు. ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితులకు తోడు, ఎక్కడ చూసినా వాహనాలను వేగంగా నడపడం అనేది ఒక ఫ్యాషన్ అయిపోయింది. భారీ వాహనాలు నడిపేవారిలోనూ ఆ తొందర కనిపిస్తోంది. అత్యంత వేగంగా వాహనాలు నడిపి ఎంతోమంది దుర్మరణం పాలవుతున్నారు కూడా. ఇదిలావుంటే, ఏదో ఒక వాహనం దొరికితే చాలని, రోడ్డుపై సర్రున దూసుకెళ్ళే లారీల్లో సైతం గబగబా ఎక్కేసే తొందర కొందరిదైతే, వాహనం మరమ్మతులో వున్నా, బ్రేకులు కూడా సరిగా పడకున్నా, ఏదోవిధంగా నడిపేసి నాలుగు డబ్బులు సంపాదించాలనే ఆరాటం మరికొందరిది. కాంట్రాక్ట్‌కి దొరికాయి కదా అని నాణ్యతకూ నిబంధనలకు పాతరేసి, అడిగేవారెవరూ లేరు కదా అని చిత్తం వచ్చిన రీతిలో రోడ్లు వేసేసి కోట్లు సంపాదించేయాలనే కక్కుర్తి మరికొందరిది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రయాణీకుడి చావుకు లెక్కలేనన్ని కారణాలన్నట్లు... ఎన్నని చెప్పగలం?.. ఏదేమైనా, ప్రమాదంలో తమ ఆప్తులు, ఆత్మీయులైన వారి ప్రాణాలే పోయి.. బాధితులు గుండెపగిలేలా రోదిస్తుంటే వారిని ఏమని ఓదార్చ గలం?.. వారికేమని జవాబు చెప్పగలం?.. ముఖ్యంగా, అత్యధికశాతం మంది ప్రయాణించే ఆర్టీసి బస్సుల్లో కూడా రానురాను భద్రత కొరవడుతోండడం మరింత బాధాకరం. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం సురక్షితం అని ఎంతో భరోసాతో బస్సు ఎక్కినవారు కూడా ప్రమాదానికి గురైతే ఇక ఎవరికి చెప్పుకోవాలి?.. బస్సు ప్రమాదాలు నివారించేందుకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నామని ప్రభుత్వం, అధికారులు ప్రచారార్భాటాలు చేసుకుం టున్నప్పటికీ, ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలను ఎప్పటికి తీసుకుంటారో?.. డొక్కు బస్సుల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్త బస్సులను వేయగల గడం సాధ్యమేనా?.. స్టార్ట్ కాని ఇంజన్లు, ప్రయాణీ కులు తోస్తే తప్ప కదలని బస్సులూ.. వీటితో ప్రయా ణీకుల అవస్థలు ఇంకా ఎంతకాలం?.. ఈ గతుకుల రోడ్లకీ, డొక్కు బస్సులకీ మోక్షం ఎప్పుడు?.. అన్నీ సమాధానం లేని ప్రశ్నలే. ఇదిలావుంటే, అక్కడక్కడా కొన్నిచోట్ల అధికారుల తీరుపై కూడా అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. రవాణాశాఖ, ఆర్టీసిలు బాధ్యతా రాహిత్యంతో వుంటున్నాయని, వాటి పనితీరు మెరుగుపరుచుకోవాలని సాక్షాత్తూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రే ఇటీవల ఆ శాఖల తీరుపై అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ప్రజల శ్రేయస్సే పరమావధిగా పనిచేయడం అందరి తక్షణ కర్తవ్యం. ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించడం కోసం అందరూ కృషి చేయాలి. మృత్యుద్వారాలను మూసివేసి, ప్రజల సురక్షిత ప్రయాణానికి బాటలు వేయాలి. రోడ్ల బాగుకు నిధుల విషయం పెద్దసమస్యే అయి నప్పటికీ.. ఆ సమస్యను కూడా ప్రభుత్వం అధిగమించగలగాలి. రోడ్ల మరమ్మతులు-నిర్వహణ, బస్సుల స్థితిగతులు పరిశీలించి వాటిని బాగు చేయడం, వాహనాలు నడపడంలో మెళకువలు..అవసరమైన చోటల్లా హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేయడం, వగైరాలన్నీ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఎంతో ముఖ్యమైన అంశాలే. వీటన్నిటినీ ప్రభుత్వం సహనంతో..సమన్వయంతో, చిత్తశుద్ధితో సాధించగలిగినప్పుడే కొంతమేరకైనా ప్రయాణాల్లో ప్రమాదాల నుంచి బయటపడగలం. లేదంటే, ఈ రోడ్లకీ, ఆ బస్సులకే కాదు, ప్రయాణాలకీ..మనుషుల ప్రాణాలకి కూడా భద్రత, భరోసా వుంటుందని చెప్పలేం!...

## రోడ్లా...మృత్యుద్వారాలా?



రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు నర కానికి నకళ్ళుగా వుంటున్నాయి. మృత్యు మార్గానికి ముఖద్వారాలుగా మారిపో తున్నాయి. రోడ్ల నిర్మాణాల్లో అక్రమాలు, అవకతకవలు, అంతటా పెరిగి పోతున్న అవినీతి.. మరోవైపుఎక్కడ చూసినా గతుకుల రోడ్లు.. వేలాదిగా డొక్కు వాహనాలు.. ఇవన్నీ చాలవన్నట్లు మితిమీరిన వేగం.. తదితర కారణాలతో ప్రతి నిత్యం ఎక్కడో ఒకచోట ఘోరమైన రోడ్డు ప్రమాదాలు జరిగిపోతూనే వున్నాయి.. ఎంతోమంది మృత్యువాత పడుతూనే వున్నారు.

## సావిత్రిబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ఆయన అర్ధాంగి అయిన సావిత్రిబాయి పూలే మహిళా విద్యకోసం చేసిన సేవలు అపారమైనవని, సమాజానికి నిరుపమానమైన సేవలందించిన సావిత్రిబాయి పూలేకు భారతరత్న అవార్డు వచ్చేందుకు కృషిచేయాలని మహాత్మా జ్యోతిరావుపూలే కార్యాలయ వ్యవస్థాపకురాలు, వడ్డెర సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు మల్లి నిర్మల కోరారు. హైదరాబాద్‌లో ఈనెల 9న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యను కలసి ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు. సావిత్రిబాయి పూలేకు భారతరత్న వచ్చేవిధంగా కృషి చేయాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సావిత్రిబాయి పూలే స్త్రీ జాతికే తలమానికం వంటివారని, మహిళా విద్య కోసం మొట్టమొదట మహిళా విద్యాలయాన్ని స్థాపించి, మహిళలు చదువుకునేందుకు ఆమె ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలేకు భారతరత్న అవార్డును ప్రకటించాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## అనాథాశ్రమానికి విరాళం

నెల్లూరుజిల్లా అల్లూరు మండలం గొల్లపాలెంలోని చైల్డ్ అనాథాశ్రమానికి సంక్రాంతి సందర్భంగా నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమ్మిడి రాజశేఖర్ సహకారంతో రూ.10వేలు విరాళమిచ్చారు. ఆదివారం నెల్లూరు హరనాథపురంలోని నేస్తం ఫౌండేషన్ కార్యాలయంలో ఆశ్రమ నిర్వాహకులకు నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు కోరెం ప్రవీణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శరత్, నేస్తం ఫౌండేషన్ సభ్యులు కోరెం వెంకటేశ్వర రావు, విక్రమ్‌కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

### చెరుకు రైతుల
## సమస్యలు పరిష్కరిస్తాం

**- జిల్లా కలెక్టర్**

చెరుకు రైతుల సమస్యలను పరిష్క రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుం టామని జిల్లా కలెక్టర్ ఎం.జానకి పేర్కొ న్నారు. ఈ నెల 9న వివిధ శాఖల అధికారులు, చెరుకు రైతుల సంఘం నాయకులతో ఆమె సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖలోని ఏటికొప్పి చక్కెర ఫ్యాక్టరీ యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయని, అందువల్ల కోవూరు షుగర్ ఫ్యాక్టరీ యంత్రాలను అక్కడకు తరలిం చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే, ఇక్కడి రైతులు అందుకు అడ్డుపడుతున్నారని అంటూ, ఇక్కడి చెరుకు రైతులతో సమావేశం నిర్వహిస్తామని, రైతుల సమస్యలు పూర్తిగా తెలుసుకున్న తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.


## పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

**- ఏజేసీ రాజ్‌కుమార్**



జిల్లాలో రెండు విడతలుగా జరుగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు సంయుక్త కలెక్టర్ రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు.

పల్స్‌పోలియో ఏర్పాట్లపై ఆయన ఈ నెల 10న కలెక్టరేట్‌లోని గోల్డన్‌జుబ్లీ హాలులో అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పల్స్‌పోలియో లక్ష్య సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ నెల 18, 19, 20వ తేదీల్లో తొలివిడత పల్స్‌పోలియో జరుగుతుందని, అదేవిధంగా ఫిబ్రవరి 22, 23, 24 తేదీల్లో రెండవ విడత పల్స్‌పోలియో నిర్వహించాలని పేర్కొన్నారు. 0-5 సంవత్సరాల పిల్లలను గుర్తించి వారందరికీ పోలియోచుక్కలను వేయాలన్నారు. ప్రధానంగా మురికివాడల్లోని పిల్లలను, మత్స్యకారుల పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న డిఎంఅండ్ హెచ్ఓ భారతిరెడ్డి మాట్లాడుతూ అందరూ కలసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పోలియోవ్యాధిపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగా హన కల్పించారు. ఈ సమావేశంలో డిఇఓ ఆంజనేయులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జయసింహ, పలువురు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఐడెంటిటి కార్డులివ్వాలి

నెల్లూరులో ఇటీవల జరిగిన న్యాయవాది అల్లం నరేంద్ర హత్య ఆందోళన కలిగిస్తుంది. న్యాయవాదులపై కొందరు నిందితులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, గుమస్తాలు ఎవరో, నిందితులెవరో అర్ధం కావడం లేదు. న్యాయవాదులకు, గుమస్తాలకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలి.

**ఐవిఎస్ రాము, నెల్లూరు.**

## మతం కాదు.. మానవత్వం ముఖ్యం

దేశంలో మత రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. ఘర్‌వాపసీ పేరుతో విశ్వహిందూ పరిషత్ మత మార్పిళ్లు మొదలుపెట్టింది. భారతదేశంలో ఉండేవాళ్లంతా హిందువులేనని విహెచ్‌పి నేతలంటే, ఈ దేశంలో ఉండేవారంతా ముస్లింలేనంటూ అసదుద్దీన్ ఒవైసీ కొత్త వివాదం లేపారు. వీళ్లు మతంకు ఇస్తున్న ప్రాధాన్యత మానవత్వంకు ఇవ్వడం లేదు. మతంను ఒంటికి ఇంటికీ పరిమితం చేయాలి. మతపరమైన ప్రచారాలను, ప్రలోభాలను, మత మార్పిళ్లను అరికట్టే దిశగా కేంద్రప్రభుత్వం చట్టం తీసుకురావాలి.

**ఎల్.సుజాత, హైదరాబాద్.**

## అన్యాక్రాంతమైన స్థలాలు

ఈమధ్య నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవతో ఇస్కాన్‌సిటి ప్రాంతంలో రిజర్వు స్థలాన్ని గుర్తించడం అభినందనీయం. నగర పాలక సంస్థ అధికారులు మనసుపెట్టి వెదికితే నెల్లూరు నిండా ఇలాంటి స్థలాలు చాలా కనిపిస్తాయి. వీటిని ప్రజావసరాలకు వినియో గించవచ్చు. అలాగే గుర్తించిన రిజర్వు స్థలాలను ప్రజలకు ఉప యోగపడేలా చేయండి.

**- గంటిపూడి మల్లిఖార్జున, నెల్లూరు.**

## తమ్ముళ్ళ మధ్య...

# విభేదాల కోట... సూళ్లూరుపేట

**పేరుకు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమే గాని సూళ్లూరుపేటలో ఉన్నంత రాజకీయం ఎక్కడా ఉండదు. ఎందుకంటే ఇక్కడ ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మెన్‌ల రూపంలో నడిచేది ఒకరిద్దరైనా, వారిని నడిపించే శక్తులు ఎక్కువగా వుంటాయి.**







సూళ్లూరుపేటలో వర్గ రాజకీయాలెక్కువ. అయితే ఇంతవరకు పార్టీల పరంగా వున్న వర్గ రాజకీయాలు ఇప్పుడు ఒకే పార్టీలోకి దూరాయి. ప్రస్తుతం అధికార తెలుగుదేశంపార్టీ ఒక్కటే అక్కడ వర్గ రాజకీయాలకు కేంద్రబిందువుగా మారింది.

సూళ్లూరుపేటలో 1983 నుండి కూడా తెలుగుదేశం పార్టీ అంటే వేనాటి మునిరెడ్డి, రామచంద్రారెడ్డిలు ఒక బ్రాండ్. కాంగ్రెస్‌పార్టీలో పలువురు నాయకులున్నప్పటికీ గత 15ఏళ్లుగా వాకాటి నారాయణరెడ్డే అక్కడ ఆ పార్టీకి కీలక నాయకుడయ్యాడు. తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిని కాని, స్థానిక సంస్థల అభ్యర్థులను కాని వేనాటి వాళ్లు నిర్ణయిస్తే, కాంగ్రెస్ అభ్యర్థులను మాత్రం వాకాటి నారాయణరెడ్డి నిర్ణయిస్తుండేవాడు.

అయితే రాష్ట్ర విభజనతో రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. కాంగ్రెస్‌లో ఉండగా స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఎన్నికైన వాకాటి నారాయణరెడ్డి, 2014 లోక్‌సభ ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగి డిపాజిట్ కోల్పోయారు. కేవలం మొక్కుబడిగా మాత్రమే ఆయన పోటీ చేశారు. ఎన్నికల అనంతరం తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఇక కాంగ్రెస్‌లో ఉండి కూడా ఉపయోగం లేదనుకున్న వాకాటి నారాయణరెడ్డి ఇటీవలే తెలుగుదేశంలో చేరారు. ఇప్పుడాయన తెలుగుదేశం ఎమ్మెల్సీ లెక్క. వాకాటి చేరికతో సూళ్లూరుపేట తెలుగుదేశంపార్టీలో వేనాటితో పాటు వాకాటి వర్గం కూడా ఏర్పడింది. గతంలో కాంగ్రెస్‌లో వున్న కేడర్ అంతా వాకాటికి తోడయ్యింది. అలాగే సూళ్లూరుపేట టీడీపీలో మరో కీలక నాయకుడు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ కూడా వాకాటితో చేతులు కలిపాడు. వీళ్లంతా వేనాటికి వ్యతిరేకంగా గ్రూపు కట్టారు.

మొన్న జరిగిన పక్షుల పండుగ వేదికగా సూళ్లూరుపేటలో వర్గపోరు ముమ్మరమైంది. ఒకరి ఫ్లెక్సీలు ఒకరు చించుకునే దాకా పరిస్థితి వెళ్లింది. ఒకరిపై ఒకరు బహిరంగంగానే విమర్శలు చేసుకున్నారు. అయితే ఈ వర్గపోరు తెగేదాకా లాగకూడదు. పార్టీ సీనియర్‌లు జోక్యం చేసుకుని ఇరువర్గాలను కలిపితే పార్టీ పటిష్టంగా తయారవుతుందని కార్యకర్తల అభిప్రాయం. పార్టీ పుట్టినప్పటి నుండి అందులో వున్న వేనాటికి తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు కొత్తగా పార్టీలో చేరుతున్న వారికి కూడా తగిన గౌరవం ఇస్తే సమస్యలు లేకుండా పార్టీని నడుపుకోవచ్చు.

# గోడ దూకేస్తారా...?



**బాబు భజన చేసినా... పార్టీని మార్చబోమంటున్న ఎమ్మెల్యేలు**



***రాజకీయాల్లో ఇప్పుడు సిద్ధాంతాల ప్రాతిపదికన నాయకులు పార్టీలలో చేరడం అన్నది లేకుండా పోయింది. పదవులే పెద్ద సిద్ధాంతంగా మారిపోయాయి. ఆఖరుకు సిద్ధాంతాల పేరుతో నడిచే సిపిఎం, బీజేపీ వంటి పార్టీల్లో ఉండే నాయకులు కూడా ఆ సిద్ధాంతాలను పాటించడం లేదు. ఇక వ్యాపారసంస్థల్లాంటి కాంగ్రెస్, తెలుగుదేశం, వైసిపి వంటి పార్టీల్లో ఉండే నాయకుల గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు.***

రాజకీయ నాయకుల సిద్ధాంతం ఒకటే... ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి దూకేయడం. ఈ వరుసలోనే ఇప్పుడు జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలున్నట్లు తెలుస్తోంది. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు పార్టీ మారుతారనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా ఇద్దరు ఎమ్మెల్యేలు సూళ్లూరుపేటలో తెలుగుదేశం నాయకులతోనే రాసుకుపూసుకు తిరిగారు. అంతేగాక తమ ప్రసంగంలో చంద్రబాబు భజన చేశారు. దీనిని బట్టే వారు త్వరలో జంపింగ్ చేస్తారని ఊహాగానాలు వినిపించాయి. పాశం సునీల్ పూర్వాశ్రమం తెలుగుదేశం పార్టీయే. 1995లో గూడూరు మున్సిపల్ ఛైర్మెన్‌గా పని చేశాడు. జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించాక అందులో చేరాడు. పాశం ముందుగా చేరడం, పార్టీ కార్యక్రమాలు గట్టిగా నిర్వహించడం వల్లే మొన్నటి ఎన్నికల్లో గూడూరు సీటు కోసం పలువురు పోటీ పడ్డప్పటికీ జగన్ ఆయనకే సీటిచ్చాడు. తెలుగు దేశంలో విభేదాలతో పాటూ జగన్ ఇమేజ్ వల్ల సునీల్ గెలిచాడు. అయితే పార్టీ అధికారంలోకి రాకపోవడంతో ఈయన నిరుత్సాహపడ్డారు. అయితే తాము పార్టీని ఎట్టి పరిస్థితుల్లో వీడేది లేదని ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా విలేకర్ల సమావేశం పెట్టిమరీ చెప్పారు. ఓ పక్క చంద్రబాబు భజన చేస్తూ... ఇంకో పక్క వైకాపాలోనే ఉంటామంటున్న ఈ ఎమ్మెల్యేల వైఖరి అర్థంకాక ఆ పార్టీ నేతలు తల పట్టుకుంటున్నారు.

# అదిరిన ఒంగోలు గిత్తల ప్రదర్శన

*భారతీయ సంస్కృతిలో ఆవులకు విశిష్ట ప్రాధాన్యత ఉంది. గోమాతను దేవతల స్థానంలో పూజించే సంస్కృతి మనది. పశువులు మన కుటుంబంలో సభ్యులుగా కలిసిపోతాయి. గోవు ఉండే ఇల్లు సకల సౌభాగ్యాలతో విలసిల్లుతుందనేది ఒక నమ్మకం. గోవులో సకల దేవతలు నిక్షిప్తమై వుంటారు. కాని మన దేశంలో ఓట్ల రాజకీయాల మూలంగా గోసంపద హరించుకుపోతుంది. ఆవులు కసాయి కబేళాలకు తరలిపోతున్నాయి. గోవధ నిషేధచట్టం కాగితాలకు మాత్రమే పరిమితమవుతుంది. గో సంపద పరిరక్షణకు పలు ధార్మిక సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయి. ఈ పరంపరలోనే నెల్లూరుకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ పూండ్ల వెంకురెడ్డి సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని నెల్లూరులో భారీస్థాయిలో ఒంగోలు జాతి పశువుల ప్రదర్శనను ఏర్పాటు చేసి అందరి మన్ననలు పొందారు. నెల్లూరు పార్లమెంటుసభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తదితరులు పశువుల ప్రదర్శనను తిలకించి ఒంగోలు గిత్తలతో ఫోటోలు దిగి మురిసిపోయారు.*





నెల్లూరులోని పూండ్ల వెంకురెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరురూరల్ మండలం కనుపర్తిపాడులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒంగోలు జాతి పశువులకు 8, 9, 10, 11తేదీలలో రాష్ట్ర స్థాయిలో అందాలపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని వివిధ జిల్లాల నుంచి ఒంగోలు జాతి గిత్తలు సింహపురికి తరలివచ్చాయి. మొత్తం ఎనిమిది విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఒంగోలు జాతి పెయ్యల విభాగంలో పశువుల పళ్ల వరుసపై పోటీలు జరిగాయి. ఆయా విభాగాల్లో గెలుపొందిన పశువుల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించడంతో కర్నూలు, కృష్ణ, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు తదితర జిల్లాల నుంచి దాదాపు వందకుపైగా పశువులను తీసుకొచ్చారు. ఛాంపియన్ విభాగంలో గెలుపొందిన వారికి ఆవుల విభాగంలో అరకేజీ వెండి, గిత్తల విభాగంలో ఒక కేజీ వెండి బహుమతిగా అందజేశారు.

### విజేతలు:

**గిత్తల విభాగంలో...** పాలపళ్ల విభాగంలో నెల్లూరుకు చెందిన పిండి సురేష్‌బాబు మొదటి బహుమతిగా రూ. 20వేలు, కడపజిల్లాకు చెందిన చిలంకూరి కిరణ్‌కుమార్‌రెడ్డి రెండవ బహుమతిగా రూ. 15వేలు, కడపజిల్లాకు చెందిన గవిరెడ్డి సావిత్రమ్మ మూడవ బహుమతిగా రూ. 10వేలను గెలుచుకున్నారు.

ఒక జత పళ్ల విభాగంలో గుంటూరుజిల్లా ఈపూరుకు చెందిన శ్రీరాం దుర్గాప్రసాద్ మొదటి బహుమతిగా రూ. 30వేలు, గుంటూరుజిల్లా నాదెండ్లకు చెందిన నల్లబోయిన శ్రీనివాసులు రెండవ బహుమతిగా రూ. 25వేలు, నెల్లూరుకు చెందిన పిండి సురేష్‌బాబు మూడవ బహుమతిగా రూ. 20వేలు గెలుచుకున్నారు.

మూడుజతల పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా పొట్లపాడుకు చెందిన బొనిగల నరశింహారావు మొదటి బహుమతిగా రూ. 40వేలు, ప్రకాశంజిల్లా వంకాయపాడుకు చెందిన భవనం వెంకటరత్నంరెడ్డి రెండవ బహుమతిగా రూ. 35వేలు, గుంటూరుజిల్లా కొదపాడుకు చెందిన ఎరువ హనుమారెడ్డి మూడవ బహుమతిగా రూ. 30వేలు గెలుపొందారు.





పూర్తి పళ్ల విభాగంలో మొదటి బహుమతిని కర్నూలుకు చెందిన కాటం మురళీధర్‌రెడ్డి రూ. 50వేలు గెలుచుకున్నారు. రెండవ బహుమతిని గుంటూరుకు చెందిన కాసు అయ్యప్పరెడ్డి రూ. 40వేలును గెలుచుకున్నారు. మూడవ బహుమతిని ప్రకాశం జిల్లాకు చెందిన కల్యాణ్ ఆక్వాఫాం ఎక్స్‌పోర్టు వారు రూ. 30వేలు గెలుపొందారు.

**ఛాంపియన్లు నెల్లూరు, కర్నూలు...** 10,11తేదీలలో జరిగిన ఆవులు, గిత్తల పోటీల్లో గెలిచిన వాటికి చివరగా ఛాంపియన్ పోటీలు నిర్వహించారు. గిత్తల విభాగంలో ఛాంపియన్‌గా కర్నూలుజిల్లాకు చెందిన కాటం మురళీధర్‌రెడ్డికి చెందిన గిత్త కేజీ వెండిని గెలుచుకుంది. ఆవుల విభాగంలో ఛాంపియన్‌గా నెల్లూరుజిల్లాకు చెందిన పూండ్ల వెంకురెడ్డి ఆవు నిలిచింది. వీరు గెలుచుకున్న అరకేజీ వెండి బహుమతిని నిర్వాహకులు సేవాదృక్పథంతో రంగారెడ్డి జిల్లా భారతి నారాయణరెడ్డి గోసేవా సంఘం వారికి అందజేసినట్లు న్యాయనిర్ణేతలు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా విశ్రాంత పశువైద్యాధికారి డాక్టర్ బి.ఎస్.రెడ్డి, కోవూరు ఏడి డాక్టర్ వెంకటస్వామిరెడ్డి, రాపూరు ఏడి ప్రభాకర్‌గుప్తా, కావలి ఏడి కోటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, డాక్టర్ గురవారెడ్డిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## విఐపిల తాకిడి

ఈ వారంలో నెల్లూరుజిల్లాకు విఐపిల తాకిడి బాగానే వుండింది. 9వ తేదీ సూళ్లూరుపేటలో జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు పి.నారాయణ, పల్లె రఘునాథరెడ్డి, పీతల సుజాతలు పాల్గొన్నారు. 11వ తేదీ ముగింపు కార్యక్రమంలో పి.నారాయణతో పాటు మంత్రులు గంటా శ్రీనివాసరావు, పత్తిపాటి పుల్లారావు, సిద్దా రాఘవరావు, కొల్లు రవీంద్రలు పాల్గొన్నారు. సినీ కళాకారులు కూడా ముగింపు వేడుకలలో పాల్గొన్నారు. కాగా 11వ తేదీ వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన సంక్రాంతి సంబరాలలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, సినీహీరో, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 15వేల హృదయాలను తాకాము!


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

బొల్లినేని ఆసుపత్రిని పెట్టినప్పటి నుండి ఇంతవరకు 15వేల గుండె ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేసామని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ టి.గిరి నాయుడు చెప్పారు. 10వ తేదీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2000సంవత్సరంలో ఆసుపత్రిని ప్రారంభించడం జరిగిందని, ఈ 15ఏళ్లలోనే 15వేల ఆపరేషన్లు చేయడం వైద్యపరంగా తాము అందిస్తున్న సేవలకు నిదర్శనమన్నారు. నెల్లూరుతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు కూడా మెరుగైన కార్డియాలజీ సేవలు అందించేందుకు తాము ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రి కార్డియాలజీ చీఫ్ డాక్టర్ సి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలలో మాత్రమే సాధ్యమయ్యే యాంజియోగ్రామ్, పిటిసిఏ స్టంట్ అమర్చడం, ప్రైమరీ యాంజియోప్లాస్టీ వంటి గుండె సంబంధిత వైద్యసేవలు బొల్లినేని ఆసుపత్రిలో 2000 సంవత్సరం నుండే అందిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రిలో పేద, గొప్ప అనే తేడా లేదని, ఆరోగ్యశ్రీ ద్వారా అందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.రఘురామ్‌గుప్తా, సూపరింటెండెంట్ డాక్టర్ జె.రంగారావులు కూడా పాల్గొన్నారు.

## అండమాన్ నికోబార్ కలెక్టర్‌కు సన్మానం

నెల్లూరులోని డాక్టర్ ఎస్ఆర్‌కె పాఠశాల పూర్వవిద్యార్థి, అండమాన్ నికోబార్ కలెక్టర్ గోపీకృష్ణను పాఠశాల అధినేత పి.కృష్ణమూర్తి శాలువతో సత్కరించారు. 10వ తేదీ నెల్లూరు నగరం ఇస్కాన్‌సిటీలో వున్న డాక్టర్ ఎస్ఆర్‌కె నెక్ట్స్ జనరేషన్ స్కూల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఫుడ్‌ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గోపీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలో తాను విద్యనభ్యసించిన తీరును విద్యార్థులకు వివరించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు వండుగ విశిష్టతను తెలిపేందుకు ఫుడ్‌ఫెస్ట్‌ని ఏర్పాటు చేశామన్నారు. 135ఆహారపదార్థాలను విద్యార్థులకు పరిచయం చేసామన్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలతో విద్యార్థులు అలరించారు. అనాథ శరణాలయానికి బ్లూక్రాస్‌కు ఆహార పదార్థాలను అందించారు. స్కూలు డైరెక్టర్ దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు శోభితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నెల్లూరులో యాత్రజినీ క్యాబ్స్




పెద్దపెద్ద నగరాలలో కనిపించే కాల్‌టాక్సీలు ఇప్పుడు నెల్లూరుకు కూడా వచ్చాయి. కోమిట్ల బస్ సర్వీస్ వారు యాత్రజినీ పేరుతో ఇప్పటికే ప్రైవేట్ ట్రావెల్స్ నడుపుతున్నారు. కాగా, ఇప్పుడు టాక్సీలను కూడా అందుబాటులోకి తెచ్చారు. నెల్లూరులో ఎక్కడ నుండి ఎక్కడికైనా వందరూపాయలతో ప్రయాణించేందుకు వీలుగా ఈ టాక్సీలను ప్రవేశపెట్టారు. 10వ తేదీ వెంకటాచలం మండలం కాకుటూరులోని హర్ష టొయోటా షోరూం వద్ద ఈ క్యాబ్ సర్వీసును కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్య నాయుడు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, టొయోటా షోరూం అధినేత యం.హర్షవర్ధన్, కోమిట్ల సంస్థ అధినేత సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ నెల్లూరులో
## పూడిక తీసిన అధికారులు

స్వచ్ఛ నెల్లూరు కార్యక్రమంలో అధికారులు మేము సైతం అంటూ నెల్లూరు నగరంలోని 52వ డివిజన్‌లోని కాలువల్లో పూడిక తీసారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీరు ఇమాముద్దీన్, ఇన్‌ఛార్జ్ సిటీప్లానర్ శ్రీనివాసులు, సహాయ సిటీ ప్లానరు వరప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలికి.. గజగజ

జిల్లాలో చలి తీవ్రత బాగా పెరిగింది. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు మరింత తగ్గడంతో చలి అందరినీ వణికిస్తోంది. రాత్రి వేళల్లో మంచు కమ్ముకొస్తోంది. వేకువ జాము నుంచీ మంచు మరింత విపరీతంగా వుండి, ఉదయం వేళ దాదాపు 7గంటల దాకా బాగా చలిగానే వుంటోంది. ఈ చలితో చిన్నారులు, పసిబిడ్డలు, వృద్ధులు మరింతగా అవస్తలు పడుతున్నారు. పల్లెలతో పాటు నగరాల్లోనూ చలి బాగా పెరిగింది. మంచు ఎక్కువ అవుతుండడంతో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా వుంటోంది.

### 21 నుండి మహిళలకు
## ట్రైనింగ్ కోర్సులు

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థ ఈ నెల 21వ తేదీ నుండి మహిళలకు ట్రైనింగ్ కోర్సులు ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బి.రామచంద్రరావు తెలిపారు. టైలరింగ్, బ్యూటీపార్లర్, జర్దోసి మగ్గం వర్క్స్ కోర్సులకు 18సంవత్సరము లపైన 40సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు కనీసం 7వ తరగతి చదువుకుని ఉండాలని, ఉచిత భోజనము, హాస్టల్ వసతి కలదన్నారు. ట్రైనింగ్‌లో చేరదలచుకున్నవారు 21తేదీ 4పాస్‌పోర్టుసైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం జెరాక్స్ కాపీలు, 7వ తరగతి ఆపైన చదువుకున్నవారు మార్కుల లిస్టు జెరాక్స్ కాపీలు తీసుకుని రావాలన్నారు. 0861-2383555 ఫోన్ నెంబరుకు ఫోన్‌చేసి తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు.

## రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

జిల్లా సరిహద్దులో 'సిమి' ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందిన నేపథ్యంలో ఆర్‌పిఎఫ్ జిఆర్‌పిఎఫ్ పోలీసులు 10వ తేదీ సంయుక్తంగా నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు మీదుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లలో విస్తృతంగా సోదాలు చేసారు. ప్లాట్‌ఫారాలపై అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని తనిఖీ చేశారు.


# ప్రజల ముందుకు పాలన

### నెల్లూరుజిల్లా జేసీ ఇంతియాజ్



నెల్లూరుజిల్లాలో రెవెన్యూ పాలనను ప్రజల ముందుకు తీసుకెళ్లి సుపరిపాలన అందిస్తానని జాయింట్ కలెక్టర్ ఎయండి ఇంతియాజ్ పేర్కొన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లో నెల్లూరుజిల్లా 37వ జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇక్కడ పనిచేయడంతో జిల్లా పరిస్థితులపై అవగాహన ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. జేసికి డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డి, ఎఓ రామకృష్ణ కలెక్టరేట్ సూపరింటెండెంట్లు కలెక్టరేట్ వద్ద స్వాగతం పలికారు.

## 19న జగన్నాథ రథయాత్ర



ఈ నెల 19వ తేదీన నెల్లూరులో 4వ శ్రీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నెల్లూరు అధ్యక్షులు శ్రీ సుకదేవ స్వామీజీ తెలియజేశారు. ఈ నెల 9న ఆయన నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఆ మేరకు జగన్నాథ రథయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకకల్యాణం కోసమే జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. శ్రీ జగన్నాథస్వామి అనుగ్రహంతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. పలు రాష్ట్రాల్లోని 30 ఇస్కాన్ మందిరాలకు చెందిన అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇస్కాన్ సౌత్‌ఇండియా జోన్ స్వామీజీ, జపాన్‌కు చెందిన భానుస్వామీజీ మహరాజ్‌లతో పాటు, రాష్ట్ర మునిసిపల్ మంత్రి డాక్టర్ నారాయణ, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లాకలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ప్రముఖ వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. రథయాత్రకు హాజరయ్యే 30మంది స్వామీజీల సమ్మేళనం ఈ నెల 20న జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రథయాత్ర కో-ఆర్డినేటర్ డివిఎస్ గిరి, సభ్యులు పివి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి



పోటీలలో మొదటి బహుమతినందుకుంటున్న ముక్కాల ద్వారకానాథ్, ప్రదీప్

క్రీడాకారులను ప్రోత్సహించాలని, ప్రతిభగల క్రీడాకారులు అనేకమంది క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారని డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు.

నెల్లూరు రంగనాయకులపేటలోని పిఎంఆర్ఎం హైస్కూల్‌లో కోట శివరామయ్య మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ ఆర్యవైశ్యుల టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోట శివరామయ్య గతంలో గ్రామీణ క్రీడలను ఎంతగానో ప్రోత్సహించేవారన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులు జిల్లాలో ఎందరో వున్నారని, వారి క్రీడాప్రతిభను నిరూపించుకునేందుకు ఇది మంచి వేదికని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు కోట గురుబ్రహ్మం, కోట సూర్యనారాయణ, సత్యనారాయణ, రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, నారాయణ, సున్నా రమేష్, గంగిశెట్టి మల్లి, బయ్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో ఆదివారం స్వర్గీయ నలుబోలు మల్లయ్యనాయుడు నాల్గవ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుమారుడు ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు అన్నదానం గావించారు. వృద్ధాశ్రమంలోని నిరుపేదలకు నెలలో ఒకరోజు గుడ్లు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బి.వి.నరసింహం, ఆశ్రమ నిర్వాహకురాలు తమ్మినేని సరళ, తుమ్మల శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాసం కల్పించాలి


కోటంరెడ్డికి తమ గోడును వెలిబుచ్చుతున్న మహిళలు

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం రోడ్డుపక్కన నివాసం వుంటున్న వారి ఇళ్లను రోడ్డు విస్తరణలో భాగంగా తొల గిస్తున్నారని, వారికి పునరావాసం కల్పించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో జరి గిన ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో తహశీల్దార్ జనార్ధన్‌రావు, ఎంపిడిఓ వసుమతిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యశిఖరానికి 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు


తమిళనాడులో ఆల్‌ఇండియా తెలుగు ఫెడరేషన్ & లింగ్విస్టిక్ మైనార్టీస్ ఫోరమ్ అధ్యక్షులు, సీనియర్ సర్జన్, నెల్లూరీయుడు డా॥ సి.ఎం.కె.రెడ్డిని వైద్యరంగంలో చేసిన విశిష్ఠ సేవలకు గాను లయన్స్‌క్లబ్ వారు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డుతో సత్కరించారు. ఈ నెల 4న చెన్నైలో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ ప్రాంతీయసదస్సులో లయన్స్ గవర్నర్ వి.యస్.బి.సుందర్, ప్రాంతీయచైర్మెన్ జె.మదన్‌గోపాల్‌రావు, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు ఇల్ల గణేశన్‌లు ఆయనకు ఈ అవార్డును అందజేసి సత్కరించారు. ముద్దు కృష్ణారెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు.

# ఆకట్టుకున్న సంగీత నవావధానం



నెల్లూరు టౌన్‌హాలులో 10వ తేదీ రాత్రి పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహాభారత ఉపన్యాసాల కార్యక్రమం ముగింపు వేడుకల్లో నలుబోలు మల్లయ్యానాయుడు స్మృత్యంకంగా వారి కుమారులు నలుబోలు బలరామయ్యానాయుడు, నలుబోలు కామేశ్వరరావులు ఏర్పాటు చేసిన సంగీత నవావధానము కార్యక్రమం సభికులను విశేషంగా ఆకట్టుకుంది.

సంగీత నవావధానము నిర్వాహకులు 18పర్యాయాలు స్వర్ణనంది అవార్డు విజేత డా॥ మీగడ రాగలింగస్వామి మాట్లా డుతూ తెలుగుభాష మృతభాషగా మారుతుందనేది ఎంతమాత్రం సరికాదన్నారు. పద్యం బతికి వున్నంత కాలం తెలుగుభాష అజరామంగా నిలిచి ఉంటుందన్నారు. 20రాగాల్లో, 140 పద్యాలను 2800రకాలుగా ప్రాశ్నికులు ప్రశ్నిస్తే వారు కోరిన రాగంలో పద్యాన్ని ఆలపించడమే నవావధానమని అన్నారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీరచయిత వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్ పాల్గొని రామలింగస్వామిని సత్కరించారు.

సంగీత నవావధాన నిర్వహణను సహస్ర సభాసింహం బి.వి.నరసింహం నిర్వహించగా ప్రాశ్నికులుగా మెట్టు రామ చంద్రప్రసాద్, వెన్నెలకంటి, వివిఎల్ భవాని, వై.శైలజ, లక్ష్మీప్రసన్న, పచ్చిపులుసు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. పురాణం, శతకం, ప్రబంధం, నాటకం, ఆధునికం, అవధానం శ్లోకంలలో అడిగిన పద్యాలను వారు కోరిన రాగాల్లో ఆలపించి ప్రేక్షకులను అలరించారు. సభాకార్యక్రమానికి ముందు ప్రముఖ సంగీత కళాకారిణి బాలార్క శిష్యురాండ్రు స్నేహ, గిరిజ ఆలపించిన కీర్తనలు సభికులను అలరించాయి. ఈ కార్యక్రమంలో 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యానాయుడు, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి



ఇసుక అక్రమ రవాణాను అరిక ట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవా లని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎం.జానకి తహశీల్దార్లను ఆదే శించారు. 10వ తేదీ కలెక్టరేట్ నుంచి వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. రీచ్‌లకు సంబంధం లేని వ్యక్తులు అక్కడ వుండి ఇసుక అక్రమరవాణాను ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ ఇంతి యాజ్, ఏజేసి రాజ్‌కుమార్, డిఆర్‌ఓ సుద ర్శన్‌రెడ్డి, డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, ఆర్‌డిఓలు ఎంవి రమణ, లక్ష్మీనరశింహం, బాబయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# గూడూరు డివిజన్ వార్తలు

## రోటరీ సేవలు అభినందనీయం

**- ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**




ఫలసరుకులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

క్రమం తప్పకుండా దశాబ్దకాలంగా రోటరీ క్లబ్ సేవలు అందించడం అభినంద నీయమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని మఠంవీధిలో ఉన్న రోటరీ భవనంలో ఈ నెల 10వ తేదీ ఆ క్లబ్ 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి నెల నిరాదరణకు గురైన వృద్ధులను గుర్తించి, వారికి అవసరమైన ఫలసరుకులను, ఇతర సామాగ్రిని అందజేయడం గొప్ప విషయ మన్నారు. దాత స్వర్గీయ అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రారంభించిన ఈ పథకం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దొడ్ల రుక్మిణమ్మ, వరదారెడ్డిల జ్ఞాపకార్థం వృద్ధులకు చీరలు, దోవతులు పంపిణీ చేశారు. అలాగే మయూరి శ్యాం యాదవ్ దాతృత్వంలో మిఠాయిలు పంచిపెట్టారు. ఆర్‌జీకే రెడ్డి హెల్పేజ్ పథకానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రఘురామిరెడ్డి, నాగసూరు గోపాల్, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ప్రతినిధులు జానకిరామిరెడ్డి, కె.సుందరరామిరెడ్డి, జేడీరెడ్డి, కె.మునిగిరీష్, దయాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, కె.ఎస్.రెడ్డి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కోలాహలంగా... సంక్రాంతి వేడుకలు



గూడూరు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఈ నెల 10వ తేదీ ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోగి మంటలు వేసి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం గోమాత పూజలు, పూరిల్లు, ఏరువాక, పొంగలి తయారీ, రాశులయ్యా, నదీస్నానం, గౌరమ్మపూజ, వడ్లు దంచడం, తదితర కార్యక్రమాలను నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు మైథిలి, స్నేహలతారెడ్డి, సుప్రజ, సునంద తదితరులు పాల్గొన్నారు.

కాగా రాజావీధి ప్రాంతంలో ఉన్న సునీతా సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వారి కార్యాలయంలో మ్యూజికల్‌ఛైర్ తదితర పోటీలను జరిపారు. విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఆ సంస్థ కార్యదర్శి సారంగ్ సులక్ష్మి తెలిపారు.



## 1.60లక్షల మందికి చంద్రన్న సంక్రాంతి సరుకులు

జిల్లా వ్యాప్తంగా 1.60లక్షల మందికి చంద్రన్న సంక్రాంతి సరుకులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ తెలిపారు.

గూడూరులోని ఎంఎల్‌ఎస్ గోడౌనును ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సరుకుల వివరాలను పరిశీలించారు. ఇప్పటికే చౌకదుకాణాలకు 70శాతం మేర సరఫరా అయ్యాయని, మిగిలిన 30శాతం కూడా సరఫరా చేసి సోమవారం నుంచి లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అంతకుముందు డిఎస్‌వో సంధ్యారాణి కూడా సరకుల సరఫరాపై ఆరా తీశారు. పూర్తి స్థాయిలో లబ్దిదారులకు సరకులను అందజేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆయన వెంట గూడూరు ఆర్డీవో రవీందర్, గోడౌను ఇన్‌ఛార్జి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



దస్త్రాలను పరిశీలిస్తున్న జేసి ఇంతియాజ్

## క్రీడలతో స్నేహభావం



మొదటి బహుమతి కైవసం చేసుకున్న పోలీసు జట్టు



రెండో బహుమతి అందుకున్న వైకాపా జట్టు

నిత్యం పనుల్లో సతమతమయ్యే వివిధ వర్గాల ప్రజలు తరచూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన 10వ తేదీ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, రెవెన్యూ, పోలీసు, వివిధ క్లబ్‌లు, రాజకీయ నాయకులకు యేటా నిర్వహించే క్రికెట్ పోటీలను తెలుగు దేశంపార్టీ నాయకుడు పొనకా శివకుమార్ రెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. వివిధ పార్టీలు, క్లబ్‌ల ప్రతినిధులు బెలూన్లను ఎగురవేశారు. కాగా ఆదివారం నాడు జరిగిన ముగింపు సమావేశంలో కోట అసోసియేట్స్ అధ్యక్షుడు కోట సునీల్ కుమార్, గ్రామీణ సిఐ శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగడం అవసరమన్నారు. అనంతరం క్రికెట్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన పోలీస్, వైకాపా జట్టుకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కోట సురేష్, నవీన్‌జయ కుమార్, శివకుమార్, కో-ఆర్డినేటర్ కడివేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల యాత్రికుల... రద్దీని క్రమబద్దీకరించే మార్గమేది?



ముక్కోటి, ద్వాదశి రెండ్రోజుల్లో లక్ష 60వేల మంది భక్తులకు శ్రీవారి దర్శనం చేయించామని టిటిడి అధికారులు చెప్పుకోవడం గొప్ప అంశం కావచ్చుకానీ ఈ దర్శన సమయంలో భక్తులు పడిన నరకయాతన గురించి ఎవరూ పట్టించుకోకపోవడం, గత అనుభవాల్ని దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందడం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. తిరుమల భద్రత గురించి నిపుణుల కమిటీలు పరిశీలన చేస్తున్నట్లు వార్తలు వింటున్నాము కానీ, దేవదేవుని దర్శించుకొని తరించుకొందామని వెల్లువలా వచ్చే సామాన్య భక్తులు భరించే యమహింస నివారణకు అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఇటు టి.టి.డి. అధికారులు కానీ, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోవడం తిరుమల భక్తులు చేసుకున్న దురదృష్టమే. ఆ దేవదేవుడే తన భక్తులకు శ్రీరామ రక్ష. వర్షంలో తడుస్తూ , చలిలో వణుకుతూ వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ ఎలాంటి ఆచ్ఛాదనము లేని క్యూలో గంటల తరబడి వేచిఉండడం ఎవరికీ పట్టడం లేదు. కాకుంటే హైద్రాబాద్ నుండి ముఖ్యమంత్రి యాత్రికుల అగచాట్ల గురించి ఆరా తీశారనో, ఆగ్రహం ప్రకటించారనో వార్తలతో తాత్కాలికంగా ఈ నాటకానికి తెరపడుతోంది. దీనికంతటికి కారణం రాజకీయాలే.

ఒకసారి గతంలోకి వెళ్తే తిరుమలకు వచ్చే యాత్రికులను నియంత్రించాలని, ఒక్క ఉదుటున లక్షలాది మందిని తిరుమలకు రానీయకుండా కట్టడి చేయాలనే ప్రయత్నాలు జరగకపోలేదు. ఒక సందర్భంలో చంద్రగిరి రైల్వేస్టేషన్ అభివృద్ధి పరచి శ్రీవారి మెట్టు వద్ద యాత్రికులకు ధర్మశాలలు నిర్మించాలనే ఆలోచన జరిగింది. ఇటీవల కాలంలో టి.టి.డి. ఇ.ఓ.గా రమేష్‌కుమార్ పనిచేసిన సందర్భంలో ఇంకొక ప్రయత్నం కూడా జరిగింది. తిరుచానూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పరచి పరిసర ప్రాంతాలలో విస్తారంగా ఉండే భూసేకరణ గావించి యాత్రికులకు వసతి కల్పించాలని తిరుమలకు అవసరమైన మేరకు యాత్రికులను అనుమతించాలని పథక రచన జరిగింది. భూసేకరణకు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ప్రతిదఫా కూడా స్థానిక రాజకీయ నాయకులు వారికి అన్ని విధాలా అండదండలు ఇచ్చే వ్యాపార వాణిజ్య వర్గాలు ఈ ప్రయత్నాలు పడనీయలేదు. తిరుపతి ప్రాధాన్యత పోతుందని సాకు చూపారు. విస్తృత్త స్థాయిలో భూసేకరణ తిరుపతిలో వీలు కాదు కాబట్టి ఈ ప్రత్యామ్నాయాలను ఆలోచించారు. ఈ అన్నీ ప్రయత్నాలు నీరుగారిపోయాయి. తిరుచానూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పరచి భూసేకరణకు నిర్దేశించిన స్థలంలో ధర్మశాలలు నిర్మించి ఉండి ఉంటే తిరుమలకు అవసరమైన మేరకే యాత్రికులను అనుమతించే అవకాశం ఏర్పడి ఉండేది. భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం వసతులతో సౌకర్యం కల్పించడం తిరుపతి తిరుమలలోని బలియమైన ఈ లాబీలకు పట్టదు. వేలాది మంది తిరుపతి తిరుమల చేరుకోవాలి. వసతి, తిండి కరువై వర్షం చలిగాలుల్లో యాత్రికులు పడిగాపులు పడాలి. తమ వ్యాపారాలు సాగాలి. ఈ పరిణామ క్రమంలో ఈ లాబీల ప్రయోజనాలు పైచేయి సంపాదించాయి.

ప్రధానంగా బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవం ఏకాదశి పుణ్యరోజులలో కాకుండా వారాంతంలో వరుసగా రెండు మూడు రోజులు సెలవు వస్తే తిరుమలకు భక్తులు వెల్లువెత్తుతున్నారు. యాత్రికుల తాకిడిని టి.టి.డి. అధికారులు ముందుగా అంచనా వేయలేని వెర్రివాళ్ళేమీ కాదు. ఎక్కడో సముద్రంలో సునామీ వస్తుందని, తుఫాను ముంచుకొస్తుందని సమాచార సేకరణ లభ్యమయ్యే ఈ రోజుల్లో తిరుమలకు భక్తులు ఆయా రోజుల్లో వచ్చే తాకిడి గురించి టి.టి.డి. అధికారులు అంచనా వేయలేక పోతున్నారా? ప్రచార సాధనాలు విస్తృత్తంగా ఉండే ఈ రోజుల్లో యాత్రికులకు ముందుగా హెచ్చరికలు చేయలేకపోతున్నారా ? వరదలాగా భక్తులు వెల్లువెత్తి, తిరుమల చేరుకుని నరకయాతన పడి వెళ్లేదానికన్నా టి.టి.డి. అధికారులు ముందుగా మేల్కొని హెచ్చరికలు జారీచేసి యాత్రికులను తిరుపతిలోనే ఎందుకు నియంత్రించలేక పోతున్నారు? ఎంతో భక్తి భావంతో ముక్తి ధ్యేయంతో వచ్చే భక్తులను సంతృప్తికరంగా ఎందుకు పంపలేకపోతున్నారు? ఏకాదశి ముందు రోజు మధ్యాహ్నానికే వరదలాగా జనం తిరుమలకు వెల్లువెత్తారు. వీరిలో కొంతమందికైనా తిరుపతిలో వసతి కల్పించి యాత్రికుల రద్దీని బట్టి తిరుమలకు భక్తులను అనుమతించి ఉండి ఉంటే టి.టి.డి. అధికారులే చెప్తున్నట్లు లక్ష 60 వేల మందికి రెండ్రోజుల్లో తొక్కిసలాటలు లేకుండా దర్శన భాగ్యం కల్పించి ఉండే వారు కాదా ? ఇందుకు ముందస్తు ప్రణాళికలేవి? ఇంత భారీ సంఖ్యలో వచ్చే యాత్రికులు తిరుపతిలో బస చేసేందుకు వసతులున్నాయా? వీటిపై టి.టి.డి. అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదు?

యాత్రికులు రద్దీ ఉన్న రోజుల్లో ఆర్.టి.సి. అధికారులతో టి.టి.డి. అధికారులకు సమన్వయం లేదు. వచ్చే యాత్రికులందరిని ప్రతి ఐదు నిమిషాలకో బస్సు పెట్టి కొండకు చేర్చడమే ఆర్.టి.సి. లక్ష్యంగా ఉంది. వేలాదిగా తిరుమలకు చేరుకుంటున్న భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం గురించి ఆర్.టి.సి. అధికారులకు పట్టదు. రద్దీ రోజుల్లో ఆర్.టి.సి.కి ఇంత ఆదాయం వచ్చిందని చెప్పుకోవడానికి మాత్రమే వారు పరిమితమౌతున్నారు. సమాచార వ్యవస్థ ఎంతో పురోభివృద్ధి సాధించిన ఈ రోజులలో బస్సు ఎక్కే భక్తులు శ్రీవారి దర్శనం చేసుకుని తిరిగి తిరుపతి చేరేవరకు సమన్వయం పరచే టెక్నాలజీను టి.టి.డి. ఎందుకు ఏర్పాటు చేసుకోలేకపోతోంది? ఎక్కడో వినీలాకాశంలో సంచరించే ఉపగ్రహాలను నియంత్రించే టెక్నాలజీ సాధించిన ఈ రోజులలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీవారి దర్శనం కావించే టెక్నాలజీ సాధించలేక పోతున్నారా? కేవలం టి.టి.డి. అధికారుల నిర్లక్ష్యం తప్ప... మరొకటి కాదు.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 16.01.2015 నుండి
తేది. 22.01.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, మకరంలో రవిబుధశుక్రులు, కుంభంలో కుజుడు, వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 16 శుక్రవారము కనుమ పండుగ

**ముహూర్తము:**

తేది 22 గురువారము రాత్రి గంట 11.25 నుండి గంట 1.30లోగా తులాలగ్నమున వివాహ, గృహప్రవేశములు

**పుష్య మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | ఏకాదశి | రా॥గం.12.48వ॥ |
| తేది. 17 | శని | ద్వాదశి | రా॥గం.12.16వ॥ |
| తేది. 18 | ఆది | త్రయోదశి | రా॥గం.11.08వ॥ |
| తేది. 19 | సోమ | చతుర్దశి | రా॥గం.9.40వ॥ |
| తేది. 20 | మంగళ | అమావాస్య | రా॥గం.7.40వ॥ |

**మాఘ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | బుధ | పాడ్యమి | సా॥గం.5.48వ॥ |
| తేది. 22 | గురు | విదియ | సా॥గం.3.32వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక, సామాజిక వ్యవహారాలలో సరైన నిర్ణయాలు తీసికొంటారు. పనులు నిదానముగా జరుగుతుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. ఉద్యోగులు బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించండి. ఆర్థిక ప్రలోభాలకు లోనుకావద్దు. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. షేర్లు లాభసాటిగా ఉంటాయి.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

భాగస్వామిక చర్చలు, ఇతర సమావేశాలు సక్రమంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు గుర్తింపుగౌరవాలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు ఫలించే అవకాశాలున్నాయి. పనుల వ్యవహారములందు అనుకూలత, ప్రశాంతత ఉంటుంది. రావలసిన బాకీలు లభించడం జరుగుతుంది.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థికంగా ఇబ్బందులు లేకపోయినా అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వృత్తివ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. కోర్టుకేసులు వాయిదా పడగలవు. షేర్లు కొంత నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. ఉద్యోగార్థులకు అవకాశాలకు మరికొంత సమయం పడుతుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో మంచిపోటీ ఉంటుంది. అయితే ఆదాయం కూడా బాగుంటుంది. కొత్త పెట్టుబడులకు, ఆర్థికావకాశాలకు అనుకూలం బాగుంటుంది. కుటుంబ ఖర్చులు, శుభకార్యముల ఖర్చులు కూడా పెరుగుతాయి. స్త్రీలకు గుర్తింపుగౌరవాలుంటాయి. అగ్రిమెంట్లు, ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్త వహించండి. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా పూర్తిచేస్తారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేపట్టిన పనులు పేచీపడే అవకాశం ఉన్నది. మంచి వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. నమ్మినవారితోనే తగాదాలు వస్తాయి. ఆదాయము కంటే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ఆస్తి క్రయవిక్రయాలలో తొందరపడవద్దు. ఫైనాన్స్, షేర్ వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగులకు స్థానమార్పు బాధ్యతల పెరుగుదల ఉంటుంది. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. దూర ప్రయాణాలు నిర్ణయం కాగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రతిభ బాగుండి గుర్తింపు లభిస్తుంది. అనుకోని స్వల్ప ఆదాయం చేతికందవచ్చును. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. కొత్త వస్తువులు సమకూరుతాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికముగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల, రాబడి బాగుంటుంది. కుటుంబంలో చిన్న చిన్న విషయాల మీద మనస్సులో తేడాలుంటాయి. బంధుమిత్రుల రాకపోకలు, శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుంటాయి. అనుకున్న పనులు హడావిడిగా చేస్తారు. ఉద్యోగులకు మంచి గుర్తింపు పనిభారం ఉంటుంది. రావలసి బాకీలు కొంత అందుతాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తివ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు సంతృప్తినిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. కొన్ని ముఖ్య పనులు వాయిదా పడవచ్చును. శుభకార్యాలలో పాల్గొనడం, ప్రయాణాలలో శ్రమ ఉంటుంది. సోదర వర్గానికి అభివృద్ధి ఉంటుంది. నూతన వస్తువులు, వస్త్రాభరణాలు సమకూరుతాయి. చిన్న హోదాతో సమాజంలో గుర్తింపు లభిస్తుంది. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకునేది ఒకటి జరిగేది మరొకటిగా ఉండి బాధ పడతారు. ఆర్థికంగా సంతృప్తి ఉండినా అదనపు రాబడిపై ఆలోచనలు చేస్తారు. స్థిరాస్తుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు చేయకండి. డబ్బు చెల్లింపులు చేస్తారు. రావలసిన బాకీలు కొంతవరకే అందుతాయి. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలలో జాగ్రత్తగా ఉండండి. ఆరోగ్యం కొద్ది సరిగా లేక ఇబ్బంది పడతారు.


### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

తొందరపాటు ప్రవర్తన, మాటలుంటాయి. వాటిని అదుపు చేసికొనండి. రావలసిన బాకీలు అందక పోవచ్చును. వృత్తి వ్యాపారాలు, వ్యాపార లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. నిర్మాణాలు, కొత్త కాంట్రాక్టులపై దృష్టి పెడతారు. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. ఇతరులకు సహాయపడడం జరుగుతుంది. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక ఇబ్బందులుంటాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ఖర్చులు పెరుగుతాయి. ఆర్థిక లావాదేవీలను వాయిదా వేసికొనండి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, ధన, వస్తు నష్టముంటుంది. అనవసర విషయాలలో తల దూర్చకండి. షేర్లు పెట్టుబడులు నిరుత్సాహ పరుస్తాయి. వ్యాపారులకు, ఉద్యోగులకు అధికారుల వల్ల ఇబ్బందులుంటాయి. కుటుంబంలో అనుకూలత తక్కువ.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

టెన్షన్ ఎక్కువగా ఉండినా చేపట్టిన పనులను సవ్యంగా చేస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుదల ఉంటుంది. అయినా అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. మిమ్మల్ని వ్యతిరేకించిన వారు కూడా మరల చేరువ కాగలరు. విలువైన వస్తు వాహనాలు సమకూరుతాయి. ఉద్యోగులకు బాధ్యతల భారము, స్థానచలనం ఉండవచ్చును.

# పెనుకొండ మృతులకు ప్రత్యేకప్రార్థనలు



నెల్లూరు నగరంలోని ఇస్లామి సెంటర్, బిలాల్ మసీదులో వెల్ఫేర్ పార్టీ నగర అధ్యక్షులు ఇలియాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో మడకశిర నుంచి పెనుకొండకు ప్రయాణిస్తూ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు శాంతిని చేకూర్చాలని మౌలాన అల్‌హజ్ ఇమాం, రియాజ్ అహ్మద్‌ఖాన్‌లు ఇటీవల నమాజ్ అనంతరం ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, సందానీ బాషా, రియాజ్‌ఖాన్, ఇరఫాన్‌ఖాన్, నదీమ్, డా॥ అమీర్‌బాషా, షాహుల్ పాల్గొన్నారు.

# ప్రాథమిక అంశాలపై పట్టు అవసరం



సదస్సుకు హాజరైన విద్యార్థులు

నెల్లూరుజిల్లాలో ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒకటైన ''గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'లో 10వ తేదీ ప్రథమ సంవత్సరం బిటెక్ విద్యార్థులకు 'ఇంజనీరింగ్ విద్యతో ఉజ్వలభవిష్యత్ నిర్మాణం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెయన్‌టియు అనంతపూర్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ఇంజనీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం నుండే ఇంజనీరింగ్ రంగంలోని ప్రాథమిక అంశాలపై పట్టు పెంచుకోవాలని, వివిధ సాంకేతిక అంశాలపై పూర్తిస్థాయి అవగాహన ఉన్నప్పుడే విజయం సాధించగలరన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపి, భవిష్యత్తు పట్ల ఆశాభావాన్ని, తమ ఆశయసాధనకు కావలసిన స్ఫూర్తిని అందించడానికి తమ కళాశాల ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మరియు కరస్పాండెంట్ యస్.సుధాకర్‌రెడ్డి, కళాశాల సంయుక్త కార్యదర్శి సి.శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి వై.విజయశంకర్‌రెడ్డి, ఫణికుమార్, కె.విజయ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# జేసి రేషన్‌షాపుల తనిఖీ

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ 10వ తేదీ నెల్లూరు, కొత్తూరులో వున్న ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. స్టాక్‌పాయింట్‌లో సరుకులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం వెంగళరావునగర్‌లోని రేషన్‌షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, సరుకులను, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జేసి వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సంధ్యారాణి, డి.ఎం ధర్మారెడ్డి తదితరులున్నారు.

## నిరుపేదలకు
# నిత్యావసరాలు పంపిణీ

నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో నిరుపేద విశ్వబ్రాహ్మణులకు సంక్రాంతి కానుకగా నిత్యావసరాలను అందజేశారు.

నెల్లూరు విబిఎస్ కల్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మానవ సేవే మాధవ సేవగా, ఈ పండుగ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమని ఆయన అన్నారు.

సేవా సంఘం వ్యవస్థాపకులు కందుకూరు చెంగయ్య ఆచారి, ట్రాన్స్‌కో ఎస్ఇ నాగశయనారావు, కార్పొరేటర్ జలీల్, సంఘం ప్రధాన కార్యదర్శి అలిమేలి శ్రీహరి ఆచారి, నిర్వాహక కార్యదర్శి మాధవయ్య ఆచారి, కోశాధికారి ఇ.శివ కుమార్ ఆచారి, సిద్ధయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలపై విచారణ జరపాలి

## - బిజెపి నేతల డిమాండ్

నీటి పారుదలశాఖలో గత ఐదేళ్ళుగా జరిగిన అవినీతి అక్రమాలపై పారదర్శకంగా విచారణ జరిపించాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, విచారణ కమిటీని కోరారు. ఈ నెల 10వ తేదిన నెల్లూరులోని నీటిపారుదల కార్యాలయంలో వున్న ప్రత్యేక విచారణాధికారిని, కమిటీ సభ్యులను ఆయన కలిసి ఆ శాఖలో అవినీతి అక్రమాలను వారికి వివరించారు. వీటన్నిటిపై క్షేత్ర స్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయులురెడ్డి, మిడతల రమేస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరులోని వేదాయపాళెంలో వున్న శ్రీ త్యాగరాజస్వామి ఆలయంలో ఈ నెల 10న త్యాగరాజస్వామి ఆరాధనా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకారాలు, పూజలు నిర్వహించారు. భక్తబృందం ఆధ్వర్యంలో, త్యాగరాజనగర్‌లో త్యాగరాజస్వామి నగర సంకీర్తనలు, భిక్షాటన నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు డివి సురేష్‌రావు, ప్రముఖ గాయనీమణి శ్రీమతి బాలార్క, జెవిఎస్ ఆర్ఎస్ ప్రసాద్, సత్యవాణి, వనజ లత, దేవసేన, రమాదేవి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొని శ్రీ త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలను అత్యంత మధురంగా ఆలపించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు జరిగింది. శ్రీ త్యాగరాజ సేవాసమితి కార్యదర్శి యనమండ్ర నాగదేవి ప్రసాద్, మాచవోలు రమేష్‌శర్మల ఆధ్వర్యంలో ఈ ఆరాధనా మహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. స్థానిక ప్రముఖులు డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ మధుసూదనశాస్త్రి, డాక్టర్ రమణి, పెళ్ళూరు సుధాకరరెడ్డి, కళాంజలి అనంత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం
# నూతన కార్యవర్గం

ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని నెల్లూరులోని ఐఎంఏ హాలులో ఈ నెల 9న జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ పి.రామకృష్ణ, కార్యదర్శిగా డాక్టర్ నిరంజన్, కోశాధికారిగా డాక్టర్ అమరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ దయాకర్‌రావు, డాక్టర్ ఠాగూర్, డాక్టర్ కనకరాజు ఎన్నికయ్యారు. అదేవిధంగా, కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ సుబ్రహ్మణ్యం, జెట్టి రమేష్, డాక్టర్ ప్రసూన, సహాయ కార్యదర్శులుగా వెంకటరావు, రమేష్, జిజియాబాయి ఎన్నికయ్యారు. వీరు కాక, మరో ఎనిమిది మందిని ఇ.సి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు వ్యవహరించారు.

# శ్వాసకోశ వ్యాధుల అవగాహన సదస్సు



నెల్లూరులోని ఏ.సి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ తేది ఉదయం శ్వాసకోశ వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. శ్వాసకోశవ్యాధుల నిపుణులు డాక్టర్ కె.గౌరీనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. కాలుష్య వాతావరణం వల్ల, మనం తినే ఆహారంలో లోపాల వల్ల కూడా వ్యాధినిరోధకశక్తి తగ్గిపోయి, ఆయాసం వంటి సమస్యలకు గురవడం జరుగుతోందన్నారు. ధూమపానం, గుట్కా, పొగాకు నమలడం వంటివి ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాటికి దూరంగా వుండాలని సూచించారు. ఈ వ్యాధి సోకినవారికి ఊపిరితిత్తుల్లో సమస్యలు వస్తుంటాయన్నారు. అందువల్ల ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ అవగాహనతో వుండాలన్నారు. పచ్చదనంతో నిండిన వాతావరణంలో, స్టేడియం వంటి ప్రదేశాల్లో నడక వల్ల శరీరానికి కావలసినంత తేమతో కూడిన ఆక్సిజన్ సమకూరి, రక్తశుద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.శ్రీనివాసకుమార్, బి.శేషగిరిరావు, టి.నారాయణ రావు, ఎస్ రాఘవేంద్రశెట్టి, వి.రంగారావు, అహ్మద్‌హుస్సేన్, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ కాశయ్య, సుందరరామిరెడ్డి, ఓబులరెడ్డి, శ్రీనివాసరావు, జయదేవ్, ఎల్లారెడ్డి, అమరేంద్రరెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, కె.ఎన్ రమేష్, రవిచంద్ర, దశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 11న నెల్లూరులోని జడ్పీ హైస్కూల్ ఆవరణంలో జిల్లా ప్రజా వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. ఆ సంఘం అధ్యక్షులు చలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం ప్రధానకార్యదర్శి మండవ శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ముగ్గుల పోటీల్లో శ్రీమతి రంజని ప్రథమ బహుమతి సాధించగా, శ్రీమతి అనూరాధ ద్వితీయ బహుమతిని, శ్రీమతి జయమ్మ తృతీయ బహుమతిని సాధించారు. వీరితో పాటు వృద్ధురాలు సీతమ్మ కూడా ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని కన్సొలేషన్ బహుమతిని సాధించడం విశేషం. విజేతలైన వీరందరికీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీరదవోలు రామిరెడ్డి, రమణయ్య, శ్రీధర్, సుధాకరరెడ్డి, శ్రీనివాసులు, చెన్నయ్య, పోలయ్యలు పాల్గొన్నారు.

# 'అమితో'త్సాహం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ శ్రేణులతో సమావేశమయ్యారు. 2019 ఎన్నికల టార్గెట్ ఏపి, తెలంగాణలు అధికారంలోకి రావడమేనని నిర్దేశించారు. తెలంగాణలో ఆ పార్టీ ఒంటరిగా వుంది. ఏ పార్టీలోనూ మొన్నటి ఎన్నికలలో పొత్తు లేదు. కాబట్టి అక్కడ సొంతంగానే ఎదగడానికి ప్రయత్నించాలని పార్టీ కేడర్‌కు ఉపదేశించారు.

విజయవాడలో మాత్రం బీజేపీ కేడర్‌కు స్పష్టమైన సంకేతాలిచ్చారు. 2019కల్లా ఏపిలో ప్రధానపాత్ర పోషించాలని ఆదేశించారు. తెలుగుదేశంతో ప్రస్తుతం పొత్తు ఉన్నా, పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే పార్టీని పెంచాలని నిర్దేశించారు. తెలుగుదేశం కోసం మనం మరుగుజ్జుగా ఉండాల్సిన పనిలేదని, మనం పెరిగితే అధికారం మనదే అవుతుందని పరోక్షంగా చెప్పారు. మహారాష్ట్ర పాలసీని కేడర్‌కు సూచించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో విభిన్న పరిస్థితులున్నాయి. తెలుగుదేశంలో కుల రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. అప్పుడే ప్రభుత్వం మీద అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషించే 'రెడ్డి' వర్గీయులు ఒక రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా పతనం కావడంతో ఆ పార్టీలో ఉన్నోళ్ల బీజేపీ వైపు చూస్తున్నారు. మరోపక్క ప్రధాన ప్రతిపక్షం వైకాపా భవిష్యత్ కూడా అగమ్యగోచరంగా ఉండడంతో ఆ పార్టీ కేడర్‌లో కూడా బీజేపీలో చేరాలనే ఆలోచనలు వస్తున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న ఈ రాజకీయ పరిస్థితులు పూర్తిగా బీజేపీకి అనుకూలించేవే! ఈ అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని, రాష్ట్రంలో ప్రధానశక్తిగా ఎదిగేందుకు అమిత్‌షా పక్కా ప్రణాళికను రచించారు.









# అంబరాన్నంటిన సంబరం

నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట ప్రాంతంలోని నేలపట్టు, పులికాట్ వద్ద ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ) పేరిట 9వ తేదీ నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, జిల్లా ఉన్న తాధికారులు హాజరై నిండుదనం తీసుకొచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వేలాదిమంది పర్యాటకులతో నేలపట్టు, పులికాట్ ప్రాంతాలు పోటెత్తాయి. పర్యాటకులు పక్షులతో పాటు కృష్ణజింకలు, మచ్చల దుప్పులు, రామచిలుకలు చూసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ గత 15ఏళ్ళ క్రితం ప్రారంభించిన పక్షుల పండుగ నేడు అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించుకునే స్థాయికి ఎదగడం ఆనందదాయకమన్నారు. మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ పులికాట్ సరస్సు పక్షులకు నిలయంగా దేశంలో రెండవ స్థానంలో ఉందన్నారు. మరోమంత్రి పీతల సుజాత మాట్లాడుతూ పక్షుల పండుగకు జాతీయ గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. పక్షుల పండుగ సందర్భంగా విద్యార్థులకు, మహిళలకు ఆటలపోటీలు నిర్వహించారు.

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం పక్షుల పండుగ రెండవరోజైన శనివారం జనసంద్రంగా మారింది. అందరూ కాలినడకన చెరువు కట్టపైకి వెళ్లి కడప చెట్లపై వున్న గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, నీటికాకులు, తెల్ల కంకణాయిలు, తెడ్డుముక్కు కొంగలను సందర్శించారు. జింకలపార్కులోని జింకలు, ఖజానాబాతులు, నక్షత్ర తాబేళ్ళు చిన్నారులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి తమ కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. పాముల ప్రదర్శనను తిలకించి, అనంతరం పలువురు అధికారులతో కలిసి కాలినడకన చెరువుకట్టపైకి వెళ్ళి కడపచెట్లపై వున్న విహంగాలను వీక్షించారు.

మూడవరోజైన ఆదివారం జరిగిన పక్షుల పండుగ ముగింపు కార్యక్రమానికి ఐదుగురు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పక్షుల పండుగకు రాలేకపోయారని, వచ్చే ఏడాది జరిగే పండుగకు వస్తారన్నారు. వ్యవసాయశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పక్షుల కోసం సూళ్లూరుపేటలో వైభవంగా పండుగ చేయడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అందరూ సంక్రాంతి పండుగను చేసుకోవాలన్న ఉద్దే శ్యంతో ప్రభుత్వం రూ.349కోట్ల వ్యయంతో చంద్రన్నకానుక ప్రతి ఇంటికి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సిద్ధా రాఘవరావు మాట్లాడుతూ సంక్రాంతికి ముందు సూళ్లూరుపేటలో మంచి పండుగ వాతావరణం వచ్చిందన్నారు. పులికాట్, నేలపట్టు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధిచేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మత్స్యకారులకు తమిళనాడు తరహాలో అన్ని వసతులు, సంక్షేమపథకాలు అమలు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఎం.వై.యస్.ప్రసాద్, జిల్లా కలెక్టర్ జానకి, ఎస్పీ సెంథిల్‌కుమార్, ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జడ్పీ ఛైర్మెన్ రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పాశం సునీల్ కుమార్, పెద్దగోనపాడు ఎమ్మెల్యే శ్రీధర్, డిసిసిబి ఛైర్మెన్ ధనుం జయరెడ్డి, పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, మాజీమంత్రులు పరసా రత్నం, బల్లి దుర్గాప్రసాద్‌రావు, జడ్పీ ఫ్లోర్‌లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, చెంగాళమ్మ ఆలయ ఛైర్మెన్ హర్షవర్ధన్‌రెడ్డి, పురపాలక ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపిపి షమీమ్, సినీప్రము ఖులు రాజేంద్రప్రసాద్, శ్రియ, అర్చన, ఉదయభాను, సంగీత దర్శకుడు కోటి తదితరులు పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమాఖ్య నూతన కమిటి

నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని బాలపీరయ్య కల్యాణ మండపంలో ఈ నెల 11వతేదీ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమాఖ్య నూతన కమిటి ఎంపిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న 13జిల్లాల బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన విజయవాడకు చెందిన కొప్పరపు వెంకటబాలకృష్ణమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

**నూతన కమిటి:** ఉపాధ్యక్షులుగా స్వయంపాకుల శ్రీనివాసులు(నెల్లూరు), ఎ.సనత్‌కుమారాచార్యులు(తిరుపతి), దవళ వెంకట్రావు (విజయనగరం), ప్రభల సుబ్రహ్మణ్యం(తూర్పుగోదావరి), ప్రధానకార్యదర్శులుగా ఎన్.వెంకటరామరాజు(కర్నూలు), ఏ.సూర్యనారాయణ మూర్తి(విశాఖపట్నం), పి.సూర్యనారాయణ(పశ్చిమ గోదావరి), కార్యనిర్వాహక కార్యదర్శులుగా మత్తనపల్లి శివరామకృష్ణప్రసాద్ (నరసారావుపేట), జె.వి.రమణ(శ్రీకాకుళం), ఎ.రవిప్రకాష్(అనంతపురం), మాచిరాజు రమణయ్య(కడప), కోశాధికారిగా చక్రాల వెంకట లక్ష్మీనరశింహం(నెల్లూరు), అడ్‌హక్ కమిటి సభ్యులుగా ఇన్నపల్లి కామేశ్వరప్రసాద్(నెల్లూరు), తుళ్లూరు ప్రకాష్(గుంటూరు) ఉన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, పలువురు బ్రాహ్మణసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గల్లీ, ఢిల్లీ రెండూ తెలిసిన నేత

***ఆయనకు కేవలం గల్లీలు మాత్రమే తెలుసని ఇంతకాలం అనుకున్నాను, కాని ఆయనకు గల్లీలే కాదు, ఢిల్లీలో కూడా అణువణువూ తెలుసు. దేశవ్యాప్తంగా గ్రామాలలో తిరుగుతూ కూడా నగరాలలో పరిస్థితులపై ఆయనకున్న అవగాహన చూస్తుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది...*** కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడును ఉద్దేశించి భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యలివి. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ ఎన్నికల ప్రచారసభలో వెంకయ్య పనితీరును ప్రధాని మోడీ ఆకాశానికెత్తారు. ఢిల్లీలో ఏ మూల ఏ సమస్య వుందో వెంకయ్యకు తెలుసు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే ఢిల్లీని సమూలంగా మార్చడానికి ఆయన ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారంటూ కితాబిచ్చారు. ప్రజాసేవ చేయాలనుకునే వారికి వెంకయ్య ఒక రోల్‌మోడల్ అంటూ మోడీ ఆయనకు ఆస్కార్ అవార్డ్ కంటే విలువైన అభినందన బహుమతిని అందించారు.

# అంతరిక్ష అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

ముంబైలోని ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఆయనకు ఈ అవార్డును ప్రకటించింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆయన చేసిన కృషికి ఈ అవార్డుతో సత్కరించనున్నారు. ఇస్రో ఛైర్మెన్‌లుగా పనిచేసిన సతీష్‌ధావన్, డాక్టర్ కస్తూరి రంగన్, డాక్టర్ జి.మాధవన్ నాయర్, డిఆర్‌డిఓ శాస్త్రవేత్త వి.కె. సారస్వత్‌లు గతంలో ఈ అవార్డును అందుకున్నారు. తెలుగుజాతి గర్వించేలా ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకోనున్న ప్రసాద్‌కు 'లాయర్' అభినందనలు.

గల్పిక

# చంద్రబాబు చెప్పిన ఫ్లెమింగో కథ

అది సూళ్లూరుపేటలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణం. ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు జరిగాయి. అక్కడ మైదానంలో వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముదురుదోమలశాఖ మంత్రి పి.నారాయణ, కలెక్టర్ ఎం.జానకిలు అక్కడ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అంతలో అక్కడకు డిఆర్‌డి నాగేశ్వరరావు పరుగెత్తుకుంటూ వచ్చి... మేడమ్, నేలపట్టులో పక్షులు లేవు, ఉన్నట్లుండి మాయ మయ్యాయి. ఇప్పుడు పర్యాటకులు అక్కడకు వచ్చా రంటే చూడడానికి కాకులు, కొంగలు తప్ప ఇంకేమీ లేవన్నాడు. నారాయణ, కలెక్టర్ జానకిలు ఆశ్చర్య పోయారు. ఉన్నట్లుండి పక్షులు ఇలా ఎందుకు చేసాయబ్బా అని ఆశ్చర్యంలో పడ్డారు. పక్షులు ఎలా వెళ్లాయో వెతికి ఎలాగైనా పట్టుకురమ్మని చెప్పి అప్పటికప్పుడు వాళ్ల అటవీశాఖ, రెవెన్యూ అధికారు లను పంపించారు.

అప్పుడే బయట కలకలం మొదలైంది. మంత్రి నారాయణ, కలెక్టర్ జానకి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌లు ఏం జరిగిందబ్బా అనుకుంటూ బయటకొచ్చారు. అక్కడ ఫ్లెమింగో ఫెస్టివల్ కోసం వేనాటి, వాకాటి వర్గీయులు కట్టుకున్న ఫ్లెక్సీలను ఒకరికొకరు తెంపుకోసాగారు. వేనాటి వర్గీయులవి వాకాటి వర్గం వాళ్లు తొలగిస్తే, వాకాటి అనుచరులు కట్టిన ఫ్లెక్సీలను వేనాటి వర్గీయులు తొలగించసాగారు. అప్పుడు మంత్రి నారాయణ కలుగజేసుకుని... ఈ ఫ్లెక్సీలను మీరు తొలగించడమెందుకు... ఆ పనేదో మున్సిపాల్టీ వాళ్లు చూసుకుంటారుగా అని చెప్పాడు. అక్కడేవున్న సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకుని... పోనీలెండి సార్, మా దగ్గర ఎలాగూ స్టాఫ్ లేదు. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు మేం చేయాల్సిన పని వాళ్లు చేసి మాకు శ్రమలేకుండా చేసారని చెప్పాడు. తర్వాత సభా కార్యక్రమానికి సమయం కావడంతో అందరూ స్కూల్ ప్రాంగణంలోకి వెళ్లారు. సభకు ఎవరు అధ్యక్షత వహించాలనేదానిపై వేనాటి – వాకాటిల మధ్య పోటీ ఏర్పడింది. మంత్రి నారాయణ రూపాయి బిళ్ల చేతిలోకి తీసుకుని టాస్ వేస్తున్నాను, బొమ్మ పడితే వాకాటి, బొరుసు పడితే వేనాటి ఈ సభకు అధ్యక్షత వహిస్తారని చెప్పాడు. ఇరువర్గాలు అందుకు అంగీక రించాయి. నారాయణ టాస్ వేసాడు. అది బొమ్మ పడింది. వాకాటి మైకందుకుని అధ్యక్ష బాధ్యత చేపట్టాడు. టాస్ వేసిన రూపాయిని తిరిగి జేబులో వేసుకోవడం మరచిపోయి నారాయణ వేదికనెక్కాడు. అక్కడే పడివున్న టాస్ వేసిన రూపాయిని వేనాటి రామచంద్రారెడ్డి చేతిలోకి తీసుకున్నాడు. ఒకపక్క బొమ్ముంది... రెండోపక్కకు తిప్పి చూసాడు. ఆశ్చర్యం ఆ పక్క కూడా బొమ్మే వుంది. తనకు కావాలనే అందరూ అన్యాయం చేసారని ఆయన బాధపడ్డారు. తర్వాత వాకాటి అతిథులను వేదికమీదకు పిలిచాడు. కాని వేనాటి పేరును మాత్రం పిలవలేదు. జనంలో నుండి కొందరు అది పనిగా గుర్తు చేశారు. దానికి వాకాటి... నాకు గుర్తుందయ్యా, పక్షుల పండుగయ్యాక ఆ పేరును స్పెషల్‌గా పిలుస్తానని వెటకారంగా అన్నాడు. ఇక్కడ వేనాటి అనుచరులకు, వాకాటి అనుచరులకు గొడవ వచ్చింది. ఇరు వర్గాల వారు కుర్చీలు గాల్లో విసురుకుంటూ గొడవకు దిగారు. ప్లీజ్ ఆపండి... ప్లీజ్ ఆపండి... అంటూ జేసీ ఇంతియాజ్ మైకు తీసుకుని అరిచినా ఉపయోగం లేకుండా పోయింది. అంతలో ఆకాశంలో హెలికాప్టర్ వస్తున్న సౌండ్ వచ్చింది. అందరూ కొట్లాట మాని ఆకాశం కేసి చూడసాగారు. కొద్దిసేపటికే అక్కడ హెలికాప్టర్ ల్యాండయ్యింది. అందులో నుండి హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిగాడు. చెప్పా పెట్టకుండా సిఎం రావడంతో అందరూ ఆశ్చర్య పోయారు. చంద్రబాబు నేరుగా వేదికనెక్కాడు. మైకు తీసుకుని... మీరు ఇంత ఘనంగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. అసలు నేలపట్టులో ఫ్లెమింగో పక్షులున్నాయా? అని ప్రశ్నించాడు. సభలో అందరూ ఉన్నాయని చెప్పారు. మీరు కాదు మీరు చెప్పండమ్మా అంటూ కలెక్టర్ జానకిని చంద్రబాబు అడిగాడు. ఆమె అందుకు... లేవు సార్, ఈరోజు ఉదయం నుండే మాయమయ్యాయి, వాటి కోసమే మేం వెదుకుతున్నా మని చెప్పింది. అప్పుడు చంద్రబాబు వుండి... ఆ పక్షులు అలిగి వెళ్లిపోయాయని అన్నాడు. పక్షులు అలిగి వెళ్లిపోవడమేంటని మంత్రి నారాయణ ప్రశ్నించాడు. అప్పుడు చంద్రబాబు చెప్పడం మొదలు పెట్టాడు. రాత్రి డ్రైఫ్రూట్స్ తినేసి మంచం మీద పడుకుని సింగపూర్ రాజధాని గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను. తెల్లవారుజామునను కుంటాను, ఫ్లెమింగో పక్షి రాణి కలలోకి వచ్చింది. సైబీరియా వంటి దేశాల నుండి వేలకిలోమీటర్లు ప్రయాణించి మేం నేలపట్టుకు వస్తుంటాం... దొరి కిన చేపలను అందరం పంచుకుని తింటుంటాం... మాకు కలిసి ఉండడం, కలిసి పయనించడం ఇష్టం. కాని సూళ్లూరుపేటలో మీ పార్టీ నాయకులు మా పేరు మీద గొడవలు పడుతున్నారు. మా పేరుతో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తూ, దాని పేరుతో తన్నుకుంటున్నారు. నేతల మధ్య విభేదాలకు మేం పరోక్ష కారణం కావడం మాకు మనస్తాపం కలి గించింది. కాబట్టి మేం ఈ బాధతో నేలపట్టును వదిలిపోతున్నాం. మీ పార్టీ నాయకులంతా కలిసి మెలిసి వుంటేనే మేం తిరిగొస్తాం అని పక్షిరాణి చెప్పిందని చంద్రబాబు చెప్పాడు. తర్వాత ఆయనే... మీ కోసం మీరెలాగూ కలిసిమెలిసి ఉండలేరు, కనీసం మీ ప్రాంతానికి వచ్చే పక్షుల మనసును అర్థం చేసుకునైనా కలవలేరా అని అడిగాడు. అప్పుడు చంద్రబాబుకు వాకాటి ఓ పక్క, వేనాటి ఓ పక్క నిలబడ్డారు. చంద్రబాబు వారిద్దరి చేతులు కలిపి, తర్వాత అందరూ చేతులు గాల్లోకి లేపి ఐకమత్యమే మహాబలం అన్న నినాదం చేశారు.

చంద్రబాబు వేదిక దిగి హెలికాప్టర్ వద్దకు పోయాడు. మంత్రి నారాయణ ఆయన వద్దకెళ్లి... మీ కలలోకి ఫ్లెమింగో పక్షి రావడం వల్లే వీళ్లను కలపగలిగామన్నాడు. దానికి చంద్రబాబు... పక్షా, పాడా... రాత్రి మనుషులను పెట్టి నేనే నేలపట్టులో వున్న పక్షులను తరిమేయించాను... వీళ్లను కలపడం కోసమే ఆ పక్షి కథ అల్లాను. ఇప్పుడు పోయి చూడండి, నేలపట్టులో పక్షులుంటాయని చెప్పి హెలికాప్టర్ ఎక్కాడు. అమ్మ నా చంద్రబాబా... నీ దగ్గర నేర్చుకోవాల్సింది చాలా ఉందంటూ నారాయణ ముక్కున వేలేసుకున్నాడు.

కదంబం

## కష్టమే

లోహితుడు
దాచేపల్లి,
8500722053

ఔను కష్టమే
మెత్తగా... సున్నితంగా
వికసిస్తున్న గులాబి మొగ్గలా
నీళ్లలో నిశ్శబ్ధంగా
కదుల్తున్న చేప మెప్పలా
తామరాకు మీద పెట్టిన వెన్నముద్దలా
ఉన్న పిల్లాడు
ఎండలాంటి ఏడుపుకు
కరిగి కన్నీరువుతుంటే
ఆపటం కష్టమే...

భుజం మీదో... వొళ్లోనో.. మెత్తటి పక్కమీదో
కాళ్ళు జారజాపి పాదాల నుంచి
మోకాళ్ల దాకా బోర్లా పడుకోబెట్టుకొనో
ఊపో... ఊహల్లో తేలించో
ఉర్కో బెట్టడం కష్టతరమే...

అలవాటైన చేతి నునుపు
బుగ్గల మీద చిటికేసినా ఏడవడు
ఛీ... పో... అని విసుక్కున్నా
పకపక మని నవ్వుతాడు
ప్రేమిస్తాడు
నవ్వుల పేరంటానికి పిలుస్తాడు
రా...
చేతనైతే నా చిటికెనవేలు పట్టుకుని
పిల్లాడి వైపో....
అని బోసినోటితో ఆహ్వానించే వాడిని

అదాటున ఏడుపు మొదలెడితే
ఆపటం... అంత సులువేమీ కాదు.

కిటికీలోంచి తొంగిచూశో
అరచేతుల్లో ముఖం దాచుకునో
చదువుతున్న పేపరు చాటున దాక్కునో
చటుక్కున్న 'బూచీ' అంటే
బ్రహ్మకమలం వికసించినట్టు నవ్వేవాడిని

అమ్మ కనిపించటం లేదని ఏడుస్తున్నప్పుడు
నిశ్శబ్దంగా ఉంచాలంటే చాలా కష్టమే.

అమ్మనూ... ఆమె స్పర్శనూ..
అమ్మ ఆత్మీయతా పరిమళాలనూ
స్వరతంత్రుల నుంచి వీచే
వాత్సల్యపు సురభిళ పవనాలనూ
అంత తేలిగ్గా నకలు చేయలేం
ఔను కష్టమే...
ఎండలాంటి ఏడుపు లంకించుకున్నాక
నకలు కాలేని మనం
వాడిని ఉర్కోబెట్టలేం.
ఊ కొట్టడం చేతకాని నాన్నలం
లాలిపాట ధ్యాన సంగీతం
ఆలపించలేని వొట్టి పరధ్యానులం
మనం వొట్టి నాన్నలం.
అమ్మను వాడి దగ్గరికో
అమ్మదగ్గరికి వాడినో చేర్చటం తప్ప
మరేమీ చేయలేని అమ్మకూచులం
మనం వొట్టి నాన్నలం..!




## కాడెద్దులు - మానవ సంబంధాలు పుస్తకావిష్కరణ

నెల్లూరు దర్గామిట్ట సరస్వతినగర్‌లోని ఐఎంఏ హాలులో 9వతేదీ సాహితీ మిత్రమండలి, జడ్పీ వాకర్స్ సంయుక్త ఆధ్వర్యంలో చెలంచర్ల భాస్కరరెడ్డి రచించిన 'కాడెద్దులు – మానవ సంబంధాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ మానవ సంబంధాలకు అక్షరరూపం కల్పించి మానవతా విలువలను చాటిచెప్పడం అభినందనీయమని, నేటితరాలకే కాకుండా భావితరాలకు మన పూర్వీకుల కాలం నాటి అను బంధాలను తెలియజేసే రచయిత ప్రయత్నం ప్రతిఒక్కరి హృదయాలను హత్తుకుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి విశాలాక్షి వృద్ధాశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నం అధ్యక్షత వహించారు. డిప్యూటి డిఎంహెచ్ఓ ఈదూరు సుధాకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బిరదవోలు రామిరెడ్డి, కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత చెలంచర్ల భాస్కర్‌రెడ్డిని సత్కరించారు.

## ఊళ్లమ్మతల్లికి కుంభాభిషేకం


నెల్లూరుజిల్లా రూరల్ మండలం కోడూరుపాడులో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ ఊళ్లమ్మతల్లికి కుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామంలోని శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ ప్రసాదాలు తదితర పూజాసామాగ్రితో ఉత్సవాన్ని నిర్వహించారు. కేరళ నుంచి ప్రత్యేక వాయిద్య బృందాలు, కళారూపాలు, కీలుగుర్రాలు తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని కోడూరుపాడు కమలాకర్‌రెడ్డి, లేబూరు పరమేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు.

## నాగేశ్వరరావుకు గురజాడ స్మారక అవార్డు



నెల్లూరుజిల్లాకు చెందిన కవి, రచయిత, నటుడు కె.వి. నాగేశ్వరరావుకు గురజాడ స్మారక అవార్డు లభించింది. విజయవాడకు చెందిన మానస సాహిత్య సాంస్కృతిక అకాడమి ఈ అవార్డును ప్రదానం చేసింది. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఈ నెల 4న నాగేశ్వరరావుకు స్వాతంత్ర్యసమరయోధుడు, ప్రజానటులు కర్నాటి లక్ష్మీనరసయ్య, శ్రీమతి బండి నాగేంద్ర పుణ్యసుశీల, శ్రీమతి కోడూరు సుమన, ప్రముఖ పాత్రికేయులు ఎన్.ధర్మారావు, సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందరావు తదితరులు ఈ అవార్డును ప్రదానం చేశారు. నాలుగు దశాబ్దాలుగా సాహితీరంగానికి విశేష సేవలందించి నందుకు ఆయనను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కాగా, గత ఏడాది రాష్ట్రంలోని వివిధ సాహితీ సంస్థల నుండి నాగేశ్వరరావు 6 ఉత్తమ కవితా అవార్డులు అందుకోవడం విశేషం.

## ప్రపంచ హిందీ దినోత్సవం




జాతీయ భాష హిందీని ఈ నెల 10వ తేదీన ప్రపంచ హింది దినోత్సవంగా జరుపు కున్నట్లు సంస్థ డైరెక్టర్ షేక్ అలీ అహమ్మద్ తెలిపారు. ఈ స్ఫూర్తితో శ్రీబాపూ హిందీ వికాస్ కేంద్రం వారు 6 నుండి 10వ తరగతి వరకు నెల్లూరుజిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో హిందీ అవగాహన ప్రతిభ పరీక్షను ఫిబ్రవరి నెల 22వ తేదీన రాష్ట్ర భాష హిందీ టాలెంట్ సెర్చ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9989188587 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# 20వ వర్ధంతి



జననం: 08-11-1930

మరణం: 18-01-1995

## స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి

వ్యవస్థాపకులు

లాయర్

తెలుగు వారపత్రిక

మహనీయుని మహాత్మకు
మా నివాళి.

'లాయర్' సిబ్బంది

కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com